

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | సోమవారం 21-04-2025 | సంపుటి - 22 | సంచిక - 356 | రూ : 4 | పేజీలు: 8


## మన తాటిముంజలు.. లొట్టలేస్తూ ఆరగిస్తున్న విదేశీయులు

రోడ్డుపక్కన అక్కడక్కడ విక్రయించే తాటిముంజలను మనం పెద్దగా పట్టించుకోం. ఇంగ్లిష్‌లో 'ఐస్ ఆపిల్'గా పిలిచే వీటిని విదేశీయులు మాత్రం లొట్టలేస్తూ ఆరగిస్తున్నారు. అమెరికా, రష్యా, మలేసియా, ఆస్ట్రేలియా తదితరాలతోపాటు ఐరోపా ఖండంలోని వివిధ దేశాల్లో నివసిస్తున్న తెలుగు ప్రజలు, విదేశీయులు ముంజలను అమితంగా ఇష్టపడుతున్నారు. ఈ డిమాండ్‌ను వ్యాపారావకాశంగా మలచుకున్నారు ఓ ఔత్సాహిక పారిశ్రామికవేత్త. యాదాద్రి-భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురంలోని ఎంఎస్‌ఎంఈ పార్కులో ఉన్న తేజస్ ఫుడ్ ఇండస్ట్రీస్ నిర్వాహకుడు ముప్పా రమేశ్ శ్వేత తెలుగు ఫుడ్స్ పేరిట తాటి ముంజలను విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు.



100 నుంచి 300 గ్రాముల ప్యాకెట్ల పరిమాణంతో రెండు రోజులకోసారి... 1,500 కిలోల వరకు 20 విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. మునుగోడు, దండుమల్కాపురం గ్రామాలకు చెందిన గీత కార్మికుల నుంచి ముంజలను సేకరించి ప్యాకింగ్ చేసి విదేశాలకు పంపిస్తున్నారు. 350 మంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పొందుతున్నారు.

## త్వరలోనే ఆర్టీసీలో 3,038 ఉద్యోగాలకు నోటిఫికేషన్: మంత్రి పొన్నం

హైదరాబాద్: తెలంగాణ ఆర్టీసీలో ఖాళీలను భర్తీ చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. త్వరలోనే 3,038 ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇస్తామని చెప్పారు. వీటిలో 2 వేల డ్రైవర్ పోస్టులు, 743 శ్రామిక్ ఉద్యోగాలు, 84 డిప్యూటీ సూపరింటెండెంట్ (ట్రాఫిక్), 114 డిప్యూటీ సూపరింటెండెంట్ (మెకానికల్), 25 డిపో మేనేజర్/అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్, 18 అసిస్టెంట్ మెకానికల్ ఇంజినీర్ పోస్టులు, 23 అసిస్టెంట్ ఇంజినీర్ (సివిల్), 11 సెక్షన్ ఆఫీసర్ (సివిల్). 6 అకౌంట్ ఆఫీసర్స్, 7 మెడికల్ ఆఫీసర్స్ జనరల్, 7 మెడికల్ ఆఫీసర్స్ స్పెషలిస్ట్ పోస్టులు ఉంటాయని చెప్పారు.



## ఉప ఎన్నికలు ఈ ఏడాదిలోనే వస్తాయి: కేటీఆర్




హైదరాబాద్: ఉప ఎన్నికలు ఈ ఏడాదిలోనే వస్తాయని.. అందరూ సిద్ధంగా ఉండాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. అత్తాపూర్ డివిజన్ కాంగ్రెస్ నేత వనం శ్రీరామ్‌రెడ్డి ఆయన సమక్షంలో భారాసలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. "కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వడంతో తినే కంచంలో మన్ను పోసుకున్నట్లయింది. సీఎం రేవంత్‌రెడ్డి మాటలన్నీ బోగస్.. 6 గ్యారంటీల్లో ఒక్కటి కూడా పూర్తి చేయలేదు. బస్సుల్లో ఆడవాళ్లు కొట్టుకునే పరిస్థితి వచ్చింది. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ పూర్తిగా క్షీణించింది. ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలున్న కాంగ్రెస్ నేతలను హైడ్రా ముట్టుకోదు. గత ఎన్నికల్లో ఓటమి భారాస కంటే ప్రజలకే ఎక్కువ నష్టం. కేసీఆర్ మరోసారి సీఎం కావడం చారిత్రక అవసరం. రెండు జాతీయ పార్టీలు తెలంగాణకు శత్రువులే" అని కేటీఆర్ అన్నారు.

## క్రికెట్ ఆడుతూ గుండెపోటుతో యువకుడి మృతి



కీసర: మేడ్చల్ జిల్లా కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో విషాదం చోటు చేసుకుంది. రాంపల్లి దాయరలో క్రికెట్ ఆడుతూ గ్రౌండ్‌లోనే ప్రణీత్ (32) అనే యువకుడు గుండెపోటుతో మృతి చెందాడు. అతడిని పాత బోయినపల్లికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. త్యాగి స్పోర్ట్స్ వెన్యూ గ్రౌండ్‌లో క్రికెట్ అడుతుండగా అతడికి గుండెపోటు వచ్చింది. అప్రమత్తమైన సహచర ఆటగాళ్లు వెంటనే ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. ఈ ఘటనతో మృతుడి కుటుంబం విషాదంలో మునిగిపోయింది.

## బైక్‌ను తప్పించబోయి..
## ఆర్టీసీ బస్సు బోల్తా.. పలువురికి గాయాలు

మేళ్లచెరువు: సూర్యాపేట జిల్లా చింతల పాలెం వద్ద ఆర్టీసీ బస్సు బోల్తాపడింది. ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. బైక్‌ను తప్పించే క్రమంలో ఆర్టీసీ బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. అక్కడే ఉన్న స్థానిక యువకులు బస్సులో చిక్కుకున్న ప్రయాణికులను బయటకు తీసి.. హుజూర్ నగర్, కోదాడ ఏరియా ఆస్పత్రులకు తరలించారు. ప్రమాద సమయంలో బస్సులో 15 మంది ప్రయాణికులు ఉన్నారు. ఆర్టీసీ బస్సు కోదాడ నుంచి చింతలపాలెం వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది.



## భారత్ నుంచి అమెరికాకు...
## ఊహించని రీతిలో తగ్గిన విమాన ఛార్జీలు

* **ఈ వేసవిలో భారత్ నుంచి అమెరికాకు విమాన చార్జీల్లో అనూహ్య తగ్గుదల**
* **ముఖ్యంగా ముంబై నుంచి బయలుదేరే విమానాల ధరల్లో గణనీయమైన మార్పు**
* **గత ఏడాదితో పోలిస్తే ఏప్రిల్-జూన్ మధ్య సగటు ధరలు 5-8 శాతం తగ్గుదల**
* **మే మధ్య ప్రయాణానికి ముంబై-న్యూయార్క్ వన్-వే టికెట్ రూ. 37,000 వరకు లభ్యం.**
* **అమెరికా విధానాల ప్రభావమే కారణమని కొందరు విశ్లేషకులు అభిప్రాయం.**

వేసవి వచ్చిందంటే చాలు, భారత్ నుంచి అమెరికా వెళ్లాలనుకునే వారికి విమాన చార్జీలు చుక్కలు చూపిస్తుంటాయి. కానీ, ఈసారి పరిస్థితి భిన్నంగా ఉంది. అనూహ్యంగా ఈ వేసవిలో అమెరికాకు విమాన టికెట్ ధరలు తగ్గుముఖం పట్టాయి. ముఖ్యంగా ముంబై నుంచి బయలుదేరే విమానాల ధరల్లో గణనీయమైన తగ్గుదల కనిపిస్తోంది. చాలా సంవత్సరాల తర్వాత వేసవి సీజన్‌లో ధరలు తగ్గడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

*** తగ్గిన ధరలతో ప్రయాణికులకు ఊరట**

ప్రయాణానికి కొన్ని వారాల ముందు టికెట్ బుక్ చేసుకుంటే ధరలు మరింత అందుబాటులో ఉంటున్నాయి. ఉదాహరణకు, మే నెల మధ్యలో ప్రయాణించేందుకు ముంబై నుంచి న్యూయార్క్‌కు వన్‌వే టికెట్ ధర శనివారం నాటికి కేవలం రూ. 37,000గా నమోదైంది. ఇక రిటర్న్ టికెట్ ధరలు పరిశీలిస్తే, మధ్య ప్రాచ్య విమానాశ్రయంలో ఎక్కువ సేపు ఆగే (లాంగ్ లేఓవర్) విమానానికి రూ. 76,000 నుంచి లభిస్తుండగా, ఢిల్లీ లేదా లండన్ మీదుగా తక్కువ విరామ సమయంతో (4 గంటల లోపు) ప్రయాణించే విమాన టికెట్‌ను రూ. 85,000కే పొంద వచ్చు. తక్షణ ప్రయాణాలకు సైతం అనుకూలమైన కనెక్షన్లతో రిటర్న్ టికెట్ ధర సుమారు లక్ష రూపాయల వద్ద లభిస్తోంది.

*** గత ఏడాదితో పోలిస్తే తగ్గుదల**

థామస్ కుక్ (ఇండియా) మరియు ఎస్‌ఓటిసి ట్రావెల్ ప్రెసిడెంట్ ఇండివర్ రస్తోగి ప్రకారం, గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఏప్రిల్‌జూన్ మధ్య కాలంలో ఢిల్లీ, ముంబైల నుంచి కీలకమైన అమెరికా నగరాలకు సగటు విమాన చార్జీలు 58% తగ్గాయి. శాన్ ఫ్రాన్సిస్కో, న్యూయార్క్, లాస్ ఏంజిల్స్ వంటి నగరాలకు సగటు చార్జీలు గత ఏడాది రూ. 1.20-1.25 లక్షలు ఉండగా, ఈసారి రూ. 1.15 లక్షలకే లభిస్తున్నాయని ఆయన తెలిపారు.



## జపాన్ లో మరో రెండు కంపెనీలతో
## రేవంత్ రెడ్డి బృందం ఎంవోయూ

* **జపాన్ లో పర్యటిస్తున్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి బృందం**
* **రాష్ట్ర అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాల కల్పనే ధ్యేయంగా పర్యటన**
* **టెర్న్, రాజ్ గ్రూప్ అనే రెండు ప్రముఖ సంస్థలతో**



తెలంగాణకు పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం జపాన్‌లో పర్యటిస్తోంది. రాష్ట్ర అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాల కల్పనే ధ్యేయంగా సాగుతున్న ఈ పర్యటనలో భాగంగా బృందం ఇప్పటికే పలు కీలక ఒప్పందాలు కుదుర్చుకుంది, ప్రముఖ సంస్థల ప్రతినిధులతో చర్చలు జరిపింది. తెలంగాణ యువతకు విదేశాల్లో, ముఖ్యంగా జపాన్‌లో ఉద్యోగ అవకాశాలు పెంచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. జపాన్‌కు చెందిన టెర్న్, రాజ్ గ్రూప్ అనే రెండు ప్రముఖ సంస్థలతో వేర్వేరుగా అవగాహన ఒప్పందాలు (ఎంవోయూలు) కుదుర్చుకుంది. ఈ ఒప్పందాల ద్వారా ఆరోగ్య సంరక్షణ రంగంలో 200, ఇంజినీరింగ్ రంగంలో 100, పర్యాటక రంగంలో 100, నిర్మాణ రంగంలో 100 చొప్పున మొత్తం 500 ఉద్యోగావకాశాలు లభించనున్నాయని అధికారులు తెలిపారు. తెలంగాణ బృందం తమ పర్యటనలో భాగంగా కితాక్యూషూ నగరాన్ని సందర్శించింది. అక్కడ నగర మేయర్ కజుహిసా టకేచీతో సమావేశమైంది. ఒకప్పుడు తీవ్ర కాలుష్యంతో సమస్యలను ఎదుర్కొని, నేడు పర్యావరణ పరిరక్షణలో ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిన కితాక్యూషూ నగరం సాధించిన ప్రగతిని, అమలు చేసిన ప్రణాళికలను బృందం అధ్యయనం చేసింది. ఈ సందర్భంగా మురసాకి రివర్ మ్యూజియం, ఎన్విరాన్‌మెంట్ మ్యూజియం, ఎకో టౌన్ సెంటర్‌లను కూడా సందర్శించారు.

# బాపట్ల జిల్లాలో పేలుడు పదార్థాలు.. విచారణకు ఆదేశించిన హోంమంత్రి అనిత

బల్లికురవ: బాపట్ల జిల్లాలో భారీగా పేలుడు పదార్థాలు దొరికిన ఘటనపై హోంమంత్రి అనిత స్పందించారు. జిలెటిన్ స్టిక్స్ అక్రమ రవాణా ఆరోపణలపై విచారణకు ఆదేశించారు. ఇక్కడి నుంచి గ్రానైట్ వ్యాపారం ముసుగులో జిలెటిన్ స్టిక్స్ తరలిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈక్రమంలో డీజీపీ, బాపట్ల జిల్లా ఎస్పీతో ఆమె ఫోన్‌లో మాట్లాడారు. 2023 వినుకొండ పేలుడు ఘటనతో సంబంధం ఉందా అనేది తేల్చాలని ఆదేశించారు. గత పంచాయతీ ఎన్నికల్లో బల్లికురవలో పేలుడు ఘటనలో వ్యక్తి మృతి చెందిన విషయం తెలిసిందే. టన్నుల కొద్దీ పేలుడు సామగ్రి సమాచారంతో శనివారం పోలీసులు అప్రమత్తమయ్యారు. తనిఖీలు చేసి జిలెటిన్ స్టిక్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. బల్లికురవ మండలంలోని గ్రానైట్ ఫ్యాక్టరీలో అక్రమంగా నిల్వ ఉంచిన 2,300 నిషేధిత ఎలక్ట్రికల్ డిటోనేటర్లు బయటపడ్డాయి.



## జిలెటిన్ స్టిక్స్ నిల్వ కేసు.. ఇద్దరు నిందితుల అరెస్టు

మార్టూరు: బాపట్ల జిల్లా మార్టూరులో జిలెటిన్ స్టిక్స్ నిల్వ కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వైకాపా నేత దాసం హనుమంతరావు సహా మరో వ్యక్తిని అరెస్టు చేసినట్లు బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు తెలిపారు. శనివారం ఎస్పీ ఆదేశాల మేరకు సోదాలు నిర్వహించిన పోలీసులు 7.5 టన్నుల పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే.



## 599 మంది పండితులకు రూ.53.91లక్షలు పంపిణీ చేసిన మంత్రి ఆనం



నెల్లూరు: సీఎం చంద్రబాబు 75వ పుట్టిన రోజు సందర్భంగా దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి హోమం నిర్వహించారు. అనంతరం రాష్ట్రంలో ఆగమ శాస్త్రం చదివి వేదపారాయణం చేసే 599 మంది పండితులకు రూ. 53.91లక్షలు పంపిణీ చేశారు. నెలకు రూ.3వేల చొప్పున జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించిన సంభావన (నిరుద్యోగ భృతి)ను వారికి చెక్కుల రూపంలో అందించారు. హోమానికి వచ్చిన 8 వేల మందికి చీరలు, పంచెలు, తిరుమల లడ్డును పంపిణీ చేశారు.

## ఇది మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం : నిమ్మల రామానాయుడు

పాలకొల్లు: 'డీఎస్సీ అంటే చంద్రబాబు.. చంద్రబాబు అంటే డీఎస్సీ' అని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మొత్తం 1.8 లక్షల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసిన ఘనత చంద్రబాబుదేనని చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో డీఎస్సీ అభ్యర్థులకు ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో 1000 మంది అభ్యర్థులకు నిమ్మల ఉచితంగా కోచింగ్ అందిస్తున్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలతో శిక్షణా కేంద్రంలో అభ్యర్థులు సంబరాలు చేసుకున్నారు. ఈ సంబరాల్లో పాల్గొన్న మంత్రి.. కేక్ కట్ చేసి.. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ చిత్రపటాలకు



పాలాభిషేకం చేశారు. విద్యారంగంలో అనేక సంస్కరణలకు మంత్రి లోకేశ్ శ్రీకారం చుట్టారన్నారు. తమది మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వమని నిరూపించామన్నారు.

## చంద్రబాబులాంటి స్వాప్నికులు, లక్ష్యసాధకులే దూరదృష్టితో ఆలోచిస్తారు: ప్రత్తిపాటి



చిలకలూరిపేట: సీఎం చంద్రబాబు జన్మదినం సందర్భంగా రైతులతో కలిసి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. పార్టీ నేతలు, రైతులు చంద్రబాబు చిత్రపటాలపై పూలు జల్లి అభిమానం చాటుకున్నారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు కలిసి రైతులకు యాంత్రిక పరికరాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ "రైతుల జీవితాల్లో వెలుగులు నింపాలన్నదే చంద్రబాబు ఆశయం. ఎవరికీ రాని నదుల అనుసంధాన ఆలోచన ఆయనకు వచ్చింది. పోలవరంబనకచర్ల పూర్తయితే చిలకలూరిపేటకు నీటి సమస్యే ఉండదు. చంద్రబాబులాంటి స్వాప్నికులు, లక్ష్యసాధకులే దూరదృష్టితో ఆలోచిస్తారు. ఆయన అభిప్రాయాలు, ఆలోచనలను ప్రధాని మోదీయే ప్రశంసించారు.

## తిరుమల అన్నప్రసాద ట్రస్టుకు భాష్యం విద్యా సంస్థలు రూ.44 లక్షల విరాళం



తిరుమల: సీఎం చంద్రబాబు పుట్టిన రోజు సందర్భంగా తిరుమలలోని భక్తులకు అన్నప్రసాదం కోసం భాష్యం విద్యా సంస్థల అధినేత భాష్యం రామకృష్ణ రూ.44 లక్షల విరాళం ఇచ్చారు. తిరుమల తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రంలో ఒక రోజు అన్న ప్రసాద వితరణకు ఆయన ఈ మొత్తాన్ని విరాళంగా ఇచ్చారు. ఈ సందర్భంగా తితిదే చైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి దాతతో కలిసి అన్న ప్రసాద కేంద్రంలో భక్తులకు స్వయంగా వడ్డించారు. అన్న ప్రసాదాల రుచి, నాణ్యతపై నెల్లూరు, గుంటూరు, హైదరాబాద్, కర్నూలుకు చెందిన కొందరు భక్తుల నుంచి బీఆర్ నాయుడు అభిప్రాయాలు తెలుసుకున్నారు.

## తెలుగు రాష్ట్రాల్లో ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

అమరావతి: ఏపీ సీఎం, తెదేపా అధినేత చంద్రబాబు 75వ జన్మదిన వేడుకులను తెలుగు రాష్ట్రాల్లో తెదేపా నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహిస్తున్నారు. పార్టీ కార్యాలయాల్లో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్నారు. మరోవైపు ఆలయాల్లో నేతలు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

*** మంగళగిరి కేంద్ర కార్యాలయంలో**

మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు చంద్రబాబు పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. 75 కిలోల కేక్ కట్ చేసి వేడుకలు చేసుకున్నారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి అచ్చెన్నాయుడు, టీడీ జనార్దన్, వర్ల రామయ్య, అశోక్‌బాబు, వీవీవీ చౌదరి, నన్నపనేని రాజకుమారి, ఎ.వి.రమణ



హాజరయ్యారు. విజనరీ లీడర్ చంద్రన్న పేరిట ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను నేతలు తిలకించారు.

**అలిపిరిలో..**

చంద్రబాబు జన్మదిన వేడుకలను తిరుమల అలిపిరి మార్గంలో పార్టీ కార్యకర్తలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారీగా కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు.

*** హైదరాబాద్ ఎన్టీఆర్ ట్రస్టు భవన్‌లో**

హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్టు భవన్‌లో చంద్రబాబు పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. వేడుకలకు ఏపీ మాజీ మంత్రి సోమిరెడ్డి, నందమూరి సుహాసిని, తితిదే బోర్డు సభ్యుడు నర్సిరెడ్డి, తెదేపా నేత అరవింద్‌కుమార్ గౌడ్ హాజరయ్యారు.

## ఆ ఆవేదనతోనే బసవతారకం ఆస్పత్రి ఏర్పాటైంది

**: ఎంపీ పురందేశ్వరి**

విజయవాడ: ప్రమాదకర క్యాన్సర్ నివారణకు ప్రతి ఒక్కరూ అవగాహనతో మెలగాలని రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి పిలుపునిచ్చారు. విజయవాడ పడమటలో సిటిజన్ ఫోర్స్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ సెంటర్ నిర్మాణానికి ఆమె వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. పామర్రు నియోజకవర్గం మూళ్లపూడిలో ఈ క్యాన్సర్ ఆస్పత్రిని నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ..తన తల్లి బసవతారకం 1984లో క్యాన్సర్‌తో మృతి చెందారని, ఆమె పడిన బాధను కళ్లారా చూశామని ఎంపీ గుర్తుచేసుకున్నారు. ఆ ఆవేదనతోనే బసవతారకం క్యాన్సర్



ఆస్పత్రి ఏర్పాటైందని చెప్పారు. "క్యాన్సర్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. 2022లో 14లక్షల మంది క్యాన్సర్‌తో మృతి చెందారు. ప్రతి 9 మందిలో ఒకరు క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. గుట్కాలు, ధూమపానం వల్ల క్యాన్సర్ బాధితుల సంఖ్య పెరుగుతోంది. అయినా, వీటిని నిషేధించలేకపోతున్నాం. క్యాన్సర్ వైద్యానికి అయ్యే ఖర్చును భరించలేక చాలా మంది పేదరికంలో కూరుకుపోతున్నారు. క్యాన్సర్ వైద్యాన్ని ప్రజలకు అందుబాటులో తీసుకురావాల్సిన అవసరం ఉంది. వైద్య సదుపాయాలు పట్టణాలు, నగరాలకే పరిమితమవుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సదుపాయాలు పెరగాలి. క్యాన్సర్ కేసులు పెరగకుండా ముందస్తు స్క్రీనింగ్ పరీక్షలు చేసుకోవాలి. ప్రతి జిల్లాల్లో క్యాన్సర్ కేర్ సెంటర్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు వచ్చింది"అని ఎంపీ పురందేశ్వరి తెలిపారు.

## చంద్రబాబు.. ఓ నిత్య విద్యార్థి : రఘురామ కృష్ణ రాజు

అమరావతి: ఏదైనా కొత్త విషయాన్ని చిన్న కుర్రాడు చెప్పినా.. శ్రద్ధగా వింటూ టైమ్ మర్చిపోయి, నిత్య విద్యార్థిగా సీఎం చంద్రబాబు నేర్చుకుంటారని ఉపసభాపతి రఘురామకృష్ణ రాజు అన్నారు. ఆయన సమయపాలనతో ఒకరిద్దరికి ఇబ్బంది కలిగినా..రాష్ట్ర ప్రజలకు భవిష్యత్‌లో ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. ఆయన ఆదర్శ రాజకీయవేత్త అని కొనియాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు 75వ పుట్టిన రోజు సందర్భంగా అసెంబ్లీ కమిటీ హాల్‌లో రెండు పుస్తకాలను రఘురామకృష్ణరాజు,



కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు ఆవిష్కరించారు. చంద్రబాబు తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభలో చేసిన ప్రసంగాలకు సంబంధించి,రెండు పుస్తకాలను జయప్రద ఫౌండేషన్ ప్రచురించింది. పుస్తకాలను తెదేపా పొలిట్ బ్యూరో సభ్యులు టీడీ జనార్ధన్, సీనియర్ పాత్రికేయులు, రచయిత విక్రమ్ పూల రూపొందించారు. 'స్వర్ణాంధ్రప్రదేశ్ సారథి నారా చంద్రబాబు నాయుడు అసెంబ్లీ ప్రసంగాలు' పేరుతో రెండు సంపుటాలు ప్రచురించారు. 19952003, 20042014 మధ్య చంద్రబాబు ప్రసంగాలను సంపుటాలుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి అచ్చెన్నాయుడు, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ లో జరిగే రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

* **వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు**



శేరిలింగంపల్లి, (ప్రజాస్పూర్తి) : ఈ నెల 27న వరంగల్ లో జరిగే రజతోత్సవ సభను విజయవంతం చేయాలని వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు అన్నారు. ఈనెల 27న వరంగల్ లో జరిగే రజతోత్సవ సభ సన్నాహక సమావేశంలో ఆదివారం మాధవరం కాలనీలోని వివేకానంద నగర్ డివిజన్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి కార్పొరేటర్ పాల్గొని చలో వరంగల్ పోస్టర్ నీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ 25 ఏళ్ల బి.ఆర్.ఎస్ పార్టీ గొప్పతనాన్ని, 10 ఏళ్ల కాలంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసినటువంటి అభివృద్ధి పనులు ప్రజలందరికీ తెలియజేయాలన్నారు. ఉద్యమకారులు, నాయకులు, కార్యకర్తలు, బిఆర్ఎస్ పార్టీని అభిమానించే ప్రతి ఒకరు ముందుకు వచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీ.ఆర్.ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గోట్టిముక్కల పెద్ద భాస్కర రావు, మాచర్ల భద్రయ్య, గిరి బాబు, ఆంజనేయులు, బాబు, సతీష్, బొబ్బిలి రమణారెడ్డి, మధు,ప్రవీణ్, రవీందర్, జై, రాజు, యాకూబ్, వెంకన్న, యశ్వంత్, ప్రభాకర్, జగదీష్, అంజి, బాబురావు, సాయి, రవి, రమేష్, నరేష్, వాసు, కృష్ణ, సత్యనారాయణ, కొండల్ రావు, సోమయ్య, బాబు, ఆనంద్, శ్రీనివాస్ రెడ్డి, రమేష్, కుమార్,రామచందర్, రాధిక, రాధా, మాధవి రెడ్డి, అవనీత, శైలజ, తదితరులు పాల్గొన్నారు .

## ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన



జగద్గిరిగుట్ట, (ప్రజాస్పూర్తి): ఉచిత వైద్య శిబిరాలు పేద ప్రజలకు ఎంతో ఉపయోగకరమని బీఆర్ఎస్ యూత్ నాయకులు కొలుకుల జైహింద్ అన్నారు.స్వర్గీయ శంకర్ నాయక్ జ్ఞాపకార్థం వారి కూతురు డాక్టర్ దివ్య రేఖ ఆధ్వర్యంలో జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని షిరిడి హిల్స్ లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ యూత్ నాయకులు కొలుకుల జైహింద్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు ఉచితంగా చెవి ,ముక్కు ,గొంతు పరీక్షలను నిర్వహించారు. అనంతరం యూత్ నాయకులు కొలుకుల జైహింద్ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో షిరిడి హిల్స్ అధ్యక్షులు బండ మహేందర్. నర్సింగ్ నాయక్. శేషారెడ్డి.శోభ నాయక్. విఠల్ ముదిరాజ. సౌమ్య దాస్. ప్రభాకర్. అనిల్ కుమార్. శివ కుమార్. మల్లేష్. తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ప్రజా సంక్షేమం సాధ్యం

* **కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్పూర్తి) : కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ప్రజా పాలన, ప్రజా అభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమవుతుందని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. గాజులరామారం డివిజన్ దేవభూమి నగర్ కాలనీ లో రూ.36 లక్షలతో సిసి రోడ్లు మంజూరైన సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ఆదివారం ఆయా కాలనీవాసులతో కలిసి సిసి రోడ్డు పనులను పరిశీలించారు.. అనంతరం దేవభూమి నగర్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని కాలనీ నూతన కార్యవర్గాన్ని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవభూమి నగర్ కాలనీ అభివృద్ధికి, కాలనీ భవనం నిర్మాణానికి గత 7 సంవత్సరాల క్రితం తను స్థలం ఇచ్చానని గుర్తుచేశారు. ఇక్కడి స్థానిక ఎమ్మెల్యే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బదనాం చేసే ప్రయత్నం చేస్తున్నాడని...అలాంటి వారికి ప్రజలు బుద్ధిచెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువజన నాయకులు చౌదరిగారి బుచ్చిరెడ్డి, అధ్యక్షులు బిక్షపతి గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సంపత్, జనరల్ సెక్రటరీ రాజేష్, నారాయణ రెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, పార్వతిషం, రజనీకాంత్, రామిరెడ్డి, నాగరాజు, నాయుడు, శ్రీనివాస్ రెడ్డి, రజనీకాంత్ రెడ్డి, లతో పాటు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు..

## అక్రమంగా తరలిస్తున్న ఇసుక పట్టివేత



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండలంలోని బంధనకల్ గ్రామ శివారులోని వాగు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను ఎస్ఐ సిహెచ్.గణేష్ పట్టుకున్నారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న సిద్ధిపేట జిల్లా ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన బండి అంజనేయులును అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి, ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. అరెస్టయిన బండి అంజనేయులును రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. ఇసుక ట్రాక్టర్ యాజమాని జిల్లెల్ల గ్రామానికి చెందిన ల్యాగల హరీష్ పరారీలో ఉన్నాడని తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.



# పన్నుల వసూళ్లపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలపై లేదా..

* **ఎండాకాలం మంచినీటి కష్టాలు కనబడట్లేదా..**
* **సిపిఎం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు**
* **ప్రజా సమస్యలపై బస్తీల్లో సిపిఎం నిరసన**

ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: మున్సిపల్ అధికారులకు పన్నుల వసూళ్లపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలపై లేదని సిపిఎం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు ఆరోపించారు. పాత కొత్త గూడెం మూడు నాలుగు వార్డులు, ప్రగతినగర్ పద్దెనిమిది, పందొమ్మిదవ వార్డులలో మంచినీటి సమస్య, డ్రైనేజీ , స్థానిక సమస్యలు పరిష్కరించాలని స్థానిక బస్తీలలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు మాట్లాడుతూ కనీసం ఎండాకాలం కూడా మంచినీళ్ళు అందించే స్థితిలో లేరని విమర్శించారు.సిపిఎం కొత్తగూడెం టౌన్ కమిటీ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించామని ఈ సందర్భంగా అనేక సమస్యలు వెలుగులోకి వచ్చాయనీ తెలియజేశారు.ఎండాకాలం ప్రజలకు మంచినీటి కష్టాలు ఎక్కువయ్యాయనీ, కిన్నెరసాని నీరు పదిహేను రోజులకొకసారి చుట్టం చూపున వస్తుందనీ గతంలో వేసిన మిషన్ భగీరథ పంపుల నుండి చుక్క నీరు రాక మంచినీళ్ళ కోసం మహిళలు పడే బాధలు చూసి గుండె చలించిపోతుందనీ ఆవేదన వ్యక్తం చేశారు.ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులు తీసుకొని తూతూ మంత్రంగా వార్డు సభలు పెట్టి అర్హుల జాబితా ప్రకటించారు.కానీ లబ్ధిదారులను ఎంపిక చేసి ఇంటి నిర్మాణం ఇంకా ప్రారంభించలేదనీ ఆరోపించారు. కొత్తగా వితంతు వృద్ధాప్య పెన్షన్లకు దరఖాస్తు చేసుకున్న వారికి పెన్షన్లు మంజూరు చేయడం లేదు అలాగే కొత్త రేషన్ కార్డు లబ్ధిదారుల పేరు ప్రకటించారు తప్ప వారికి కార్డు ఇవ్వలేదు రేషన్ షాపులో బియ్యం కూడా పోయట్లేదనీ అన్నారు. మున్సిపల్ అధికారులు పన్నుల వసూళ్లపై పెట్టిన శ్రద్ధ మున్సిపాలిటీ అభివృద్ధిపై పెట్టడం లేదనీ విమర్శించారు. దీనికి తోడు ప్రజల ఓట్లతో గెలిచిన స్థానిక కౌన్సిలర్లు కూడా వార్డుల అభివృద్ధిని గాలికి వదిలేసారనీ ఆరోపించారు. మున్సిపల్ అధికారులు స్పందించి ప్రజల దాహార్తిని తీర్చాలని,ప్రతిరోజు కిన్నెరసాని నీళ్లు ఇవ్వాలని,ఇంటింటికి నల్లా కనెక్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజలను కలుపుకొని భవిష్యత్ లో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టౌన్ కార్యదర్శి వర్గ సభ్యులు డి వీరన్న టౌన్ కమిటీ సభ్యులు ఆవుల శ్రీరాములు ఆలేటి శ్రీను నాగకృష్ణ నాయకులు దుర్గమ్మ శైలజ వంశి ముత్తేష్ చాంద్ జ్యోతి రమేష్ శారద భవాని తదితరులు పాల్గొన్నారు.

# కిమ్స్ సన్ షైన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం..

హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి : మానవసేవే మాధవసేవగా భావించి సామాజిక దృక్పథంతో పేద, మధ్యతరగతి ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో జీరా క్లబ్ ఆధ్వర్యంలో కిమ్స్ సన్ షైన్ ఆస్పత్రి వైద్యుల సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు జీరా క్లబ్ అధ్యక్షుడు గౌరీ శంకర్ తెలిపారు. 1937 వ సంవత్సరంలో ప్రారంభమైన జీరా క్లబ్ సమక్షంలో ఇప్పటివరకు అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు అని తెలిపారు. దాదాపు 300 మందికి ఉచితంగా బిపి, షుగర్, కంటి వైద్యం తో పాటు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వెల్లడించారు. ఎలాంటి తారతమ్యాలు లేకుండా ప్రజలందరికీ సేవ చేయడమే తమ లక్ష్యమని అన్నారు. జీరా క్లబ్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించినట్లు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కూడా పేద మధ్యతరగతి బలహీన వర్గాల ప్రజలకు సేవ చేయాలని సంకల్పంతో ముందుకు సాగుతున్నట్లు ఆయన తెలిపారు. సామాజిక సేవా




కార్యక్రమాలలో జీరా క్లబ్ సభ్యులు చేస్తున్న కృషిని ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు ఎం.గౌరీ శంకర్, ఉపాధ్యక్షుడు టి. ప్రమోద్ రెడ్డి, సెక్రటరీ కె.శ్రీధర్ రావు, ట్రెజరర్ బి.మురళీధర్, మెంబర్స్ వినోద్ కుమార్, కమల్ కిషోర్ అగర్వాల్, మహమ్మద్ షరీఫ్, పి.జగన్నాథం, శంకర్ గాజుల, శ్రీరంగ్ ఓజా తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ భూనీలా మేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి తృతీయ బ్రహ్మోత్సవాలు



కుత్బుల్లాపూర్, (ప్రజాస్పూర్తి) : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి శ్రీనివాస నగర్ కాలనీ లోని శ్రీ శ్రీనివాస అభయాంజనేయ స్వామి దేవస్థానంలో శ్రీ భూనీలా మేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి తృతీయ బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి , ఎన్ ఎం సి అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి లు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ధర్మకర్త రాఘవేంద్ర రావు శ్రీనివాస్ రెడ్డి కి , రాజశేఖర్ రెడ్డి లకు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పంగా శ్రీనివాసరావు, ఫణి,సత్య ప్రసాద్, ప్రసాద్, ఏనుగుల మధుసూదన్ రెడ్డి, శ్రీశైలం యాదవ్, ఏవి రావు, ఆది, సురేష్, బాలాజీ, రవి, శ్రీరామ్, శ్రీనివాస్, ప్రతాపరెడ్డి, సునీల్, గూడూరు మురళీకృష్ణ, అల్లాడి మహేష్, బాలకృష్ణ,రఘు, సురేష్, ప్రశాంత్ రెడ్డి,మహిపాల్,నర్సింగ్ రావు,రమణ బాబు,ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీసు వెంకటేశం గౌడ్ కు 2025 సేవా రత్న అవార్డు



జగద్గిరిగుట్ట, (ప్రజాస్పూర్తి) : చింతల్ డివిజన్ భగత్ సింగ్ నగర్ కు చెందిన జై గౌడ్ రాష్ట్ర అధికార ప్రతినిధి, మదర్ థెరిస్సా వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు బీసు వెంకటేశం గౌడ్ కు 2025 సేవా రత్న అవార్డు లభించింది. ఆదివారం నగరంలోని రవీంద్రభారతిలో హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీస్ జాతీయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 2025 సేవా రత్న అవార్డులు ప్రకటించారు. ఇందులో భాగంగా పలు సేవలు చేసే వారిని గుర్తించి 2025 సేవా రత్న అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ మాజీ చైర్మన్ , హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీస్ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస గుప్తా హాజరై ఆయన చేతుల మీదుగా అవార్డును బీసు వెంకటేశం గౌడ్ అందుకున్నారు.ఈ సందర్భంగా బీసు వెంకటేశం గౌడ్ మాట్లాడుతూ తనకు ఈ అవార్డు రావడంతో చాలా సంతోషంగా ఉందన్నారు. మున్ముందు మరిన్ని సేవ కార్యక్రమాలు చేపడుతానన్నారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీస్ నేషనల్ ప్రెసిడెంట్ కొంపెల్లి సత్యనారాయణ గుప్తా , వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా ఇంచార్జ్ , చింతల్ డివిజన్ ఎన్ఎల్బీ నగర్ అసోసియేషన్ అధ్యక్షులు ఆకుల ప్రభాకర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.






# కల్వరి టెంపుల్ ఆధ్వర్యంలో ఘనంగా పునరుద్దాన ఆదివారపు రోజు

శేరిలింగంపల్లి, ప్రజాస్ఫూర్తి : చాలా ప్రత్యేకమైనటువంటి రోజు మానవ చరిత్రలో ఎప్పటికీ చిరస్మరణీయం గా నిలిచిపోయినటువంటి రోజు అదే క్రీస్తు ప్రభువు వారి పునరుద్ధానపు రోజు పుట్టుట , మరణించుట అనేది ప్రతి ఒక్కరి జీవితం నందు జరిగేటటువంటి విషయమే కానీ ఏసు క్రీస్తు ప్రభువు వారి జననమైన మరణమైన ఏ విధంగా ప్రత్యేకమైనదో అదే విధంగా ఈ పునరుద్దానపు రోజు కూడా చాలా ప్రత్యేకమైనది ఆజ్ఞ అతిక్రమం ద్వారా పాపపు ప్రవేశించినప్పుడు ఆ పాపానికి జీతం మరణమైనప్పుడు ఆ మరణమును జయించుట ఎవరికి సాధ్యం కానిది కానీ ప్రభువు వారు అందరి నిమిత్తం రక్తం కార్చి ప్రాణం పెట్టి సమాధి చేయబడి మూడో రోజున అనగా ఈ ఆదివారం రోజున సమాధిని మరణాన్ని జయించి అనేకమైన వాటి చేత కట్టబడిన మరియు పట్టబడిన పరిస్థితుల్లో ఉన్నటువంటి వారిని విడిపించి జయ జీవితం అనుగ్రహించువారిగా క్రీస్తు ప్రభువు ఉన్నారు. కావున ప్రపంచ వ్యాప్తంగా ప్రభువు నమ్మిన వారు అభిమానించేవారు కూడా ఈరోజు ఎంతో పర్వదినంగా భక్తిశ్రద్ధలతో దేవుని మహిమ పరుస్తారు . మియాపూర్ లోని కల్వరి టెంపుల్ లో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

# రాజపేట పద్మశాలి సంఘం అధ్యక్షులుగా చిన్నం వెంకటరమణ ఎన్నిక





రాజాపేట, ప్రజా స్ఫూర్తి : రాజపేట గ్రామంలోని శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి సంఘం అధ్యక్షునిగా చిన్న వెంకటరమణ గెలుపొందారు. ఆదివారం ఎన్నికల పోలింగ్ నిర్వహించగా భారీ మెజారిటీతో చిన్నం వెంకటరమణ ఎన్నిక నల్లేరుపై నడకలా సాగింది. ముగ్గురు అభ్యర్థులు చిన్నం వెంకటరమణ, బిర్రు లవన్, పెంట సత్యనారాయణ లు అధ్యక్ష పదవికి పోటీ చేస్తూ నామినేషన్ దాఖలు చేయగా రెండు రోజుల ప్రచారం అనంతరం ఆదివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1:00 వరకు రహస్య బ్యాలెట్ ద్వారా ఎన్నికల అధికారి రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు బూర్గు మహేందర్రెడ్డి ఎన్నికలు నిర్వహించారు. భోజన విరామానంతరం ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరిగింది. చిన్నం వెంకటరమణ కు 102 ఓట్లు రాగా సమీప అభ్యర్థి బిర్రు లవన్ కు 53 ఓట్లు వచ్చాయి. మూడవ అభ్యర్థి పెంట సత్యనారాయణకు 10 ఓట్లు పోలయ్యాయి. దీంతో చిన్నం వెంకటరమణ 49 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఎన్నికల అధికారి బూరుగు మహేందర్రెడ్డి ప్రకటిస్తూ ధ్రువీకరణ పత్రం అందజేసి ప్రమాణ స్వీకార కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గెలుపొందిన వెంకట్ రమణ మాట్లాడుతూ పద్మశాలి కులస్తుల సంక్షేమం కోసం, వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తానని, రాజపేట పట్టణంలోని పద్మశాలి కులస్తుల ఐక్యత కోసం నిరంతరం కృషి చేస్తూ అండగా ఉంటానని, అర్హులైన పద్మశాలి కులస్తులకు అందరికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలన్నీ మంజూరి అయ్యేలా పాటుపడతానని హామీ ఇస్తూ గెలుపుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పారు. అంతకుముందు జరిగిన ఎంపికలో డైరెక్టర్ లుగా ఆడెపు రాజు, చుంచు నారాయణ, పొట్టభత్తిని వెంకటేశం, స్వర్గం బాలకిషన్, బిర్రు బాలకిషన్, గొట్టిపాముల సాయి, పెంట రమేష్, బల్ల కృష్ణమూర్తి గర్దాసు శ్రీశైలం లు ఎన్నికయ్యారు. గ్రామపంచాయతీ ఎన్నికలను తలపించేలా రాజపేట పద్మశాలి పట్టణ సంఘం ఎన్నికలు తాత్కాలిక కమిటీ ఆధ్వర్యంలో జరిగాయి. రాజపేట పట్టణంలో 750 మంది ఓటర్లు ఉండగా 250 మంది పట్టణ అధ్యక్షుని ఎన్నికకు ఓటర్లు ఉండగా 165 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాజపేటలో 200 నివాస గృహాలు ఉండగా అన్ని కులాల కంటే పద్మశాలి కులస్తుల నివాస గృహాలు ఓట్లు ఎక్కువగా ఉంటాయి. గతంలో పలుమార్లు స్థానిక సంస్థల ఎన్నికల్లో పద్మశాలీలు ఓటమి గెలుపులను నిర్ణయించారు. అంతేకాకుండా పలువురు పద్మశాలి కులస్తుల తరఫున ప్రజాప్రతినిధులుగా కుల బలంతో గెలిచిన వారు కూడా ఉన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఐక్యంగా ఉండి ఎన్నికలు నిర్వహించుకుందామని కన్న పద్మశాలీ కళలు ఆదివారం రోజు నెరవేరాయి. అధ్యక్షునిగా ఎన్నికైన చిన్నం వెంకటరమణ ను రాజపేట మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఉప్పల రమేష్, పలు పార్టీల వారు కుల సంఘాల వారు ప్రత్యేకంగా అభినందించారు. చిన్నం వెంకట రమణ అధ్యక్షునిగా ఎన్నిక కావడంతో పద్మశాలి కులస్తులు స్వీట్ల పంపిణీ చేసారు.

## ఘనంగా గోపుర కలశ ప్రతిష్ఠ మహోత్సవం



ప్రజ స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: రామవరం లోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి మందిరం లో ఆదివారం ఆలయ గోపుర కలశ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా జరిగింది. మధ్యాహ్నం నారాయణ సేవ అన్నదాన కార్యక్రమానికి భక్తులధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంపై అవగాహన



యాదగిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : ఆదివారం యాదగిరిగుట్ట మండలంలో ఏఐసీసీ,పీసీసీ,ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య డీసీసీ అధ్యక్షులు మరియు నియోజకవర్గ కోఆర్డినేటర్ సంధ్య రెడ్డి ఆదేశాల మేరకు జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంపై అవగాహన , పాదయాత్ర కార్యక్రమం యాదగిరిగుట్ట మండల అధ్యక్షుడు కానుగు బాలరాజు గౌడ్ ఆధ్వర్యంలో లప్ప నాయక్ తండ రళ్ళ జనగాం జంగంపల్లి దాతర్ పల్లి గ్రామాలలో పాదయాత్ర చేయడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న మండల ఇంచార్జ్ సుక్క స్వామి,మండల ఉపాధ్యక్షులు బండి అశోక్, ఎరుకల హేమెందర్,గుండు నరసింహ గౌడ్,గుడ్ల నరేష్,చిన్న కందుకూర్ మాజీ సర్పంచ్ రామచందర్,గ్రామ శాఖ అధ్యక్షులు మోహన్ నాయక్ నరేష్ ,సురేష్, శ్రీశైలం యాదవ్,నాగరాజు నరసింహ ఉపేందర్ రెడ్డి వెంకటేష్ నందు గౌడ్ రాజు గౌడ్ భాస్కర్ సుధాకర్ శేఖరు రాజు రాము సత్తయ్య లక్ష్మీదేవి ధనలక్ష్మి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## త్వరలోనే ఆర్టీసీలో 3,038 ఉద్యోగాలకు నోటిఫికేషన్

**: మంత్రి పొన్నం**



హైదరాబాద్: తెలంగాణ ఆర్టీసీలో ఖాళీలను భర్తీ చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. త్వరలోనే 3,038 ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇస్తామని చెప్పారు. వీటిలో 2 వేల డ్రైవర్ పోస్టులు, 743 శ్రామిక్ ఉద్యోగాలు, 84 డిప్యూటీ సూపరింటెండెంట్ (ట్రాఫిక్), 114 డిప్యూటీ సూపరింటెండెంట్ (మెకానికల్), 25 డిపో మేనేజర్/అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్, 18 అసిస్టెంట్ మెకానికల్ ఇంజినీర్ పోస్టులు, 23 అసిస్టెంట్ ఇంజినీర్ (సివిల్), 11 సెక్షన్ ఆఫీసర్ (సివిల్). 6 అకౌంట్ ఆఫీసర్స్, 7 మెడికల్ ఆఫీసర్స్ జనరల్, 7 మెడికల్ ఆఫీసర్స్ స్పెషలిస్ట్ పోస్టులు ఉంటాయని చెప్పారు.



## రోడ్డు వెడల్పు పనులు వెంటనే పూర్తి చేయాలి

*** సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్ డిమాండ్**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: గత మూడు సంవత్సరాల నుండి రోడ్డు వెడల్పు పేరుతో సింగరేణి ప్రభుత్వ ఆసుపత్రి నుండి ఎన్టీఆర్ విగ్రహం వరకు రోడ్డు వెడల్పు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది అట్టి రోడ్డు పనులను గత మూడు సంవత్సరాల నుండి నత్త నడక నడుస్తూ రోడ్డుకి ఇరువైపులా తవ్వేసి ఎవరికీ పట్టనట్లుగా సంబంధిత అధికారులు వివరిస్తున్నారనీ కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల రోడ్డు పనులు ఎక్కడికి అక్కడే ఆగిపోయాయని దానివల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే రోడ్డు వెడల్పు చేసి రోడ్డును అభివృద్ధి పరచాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్ డిమాండ్ చేశారు. స్థానిక హనుమాన్ బస్తి సిపిఎం పార్టీ శాఖ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా భూక్య రమేష్ మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుండి రోడ్డు వెడల్పు పేరుతో ఇండ్ల ముందు దుకాణాల ముందు ఎక్కడబడితే అక్కడ తవ్వేసి పనులు మరమ్మత్తులు చేయకుండా ఆపు చేయడం వల్ల బస్తీలకు వెళ్లే అవకాశం లేదని గుంతలు గుంతలు గా ఉండడం వల్ల ఆటోలు వాహనాలు తిరగలేని స్థితి ఉందని ఆక్సిడెంట్లు కూడా అవుతున్నాయని ప్రమాదాలు జరిగిన తర్వాత రోడ్డు వెడల్పు పనుల వల్లనే ఇటువంటి దారుణాలు జరుగుతున్నాయని ప్రజలు ఇబ్బందులకు గురవుతున్న నేపథ్యంలో వెంటనే రోడ్డు వెడల్పు చేసి పనులు ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. పనులు వెంటకే ప్రారంభించక పోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు . త్వరలోనే సంబంధిత ప్రజలను తీసుకొని కలెక్టర్ వద్దకు వెళుతున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు ఎన్ఎస్ రాజు శాఖ కార్యదర్శి గుగులోత్ క్రం నాయకులు గిరి అల్తాఫ్ బాబురావు , గణేష్, తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ లో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయండి

*** భువనగిరి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ అబ్బగాని వెంకట్ గౌడ్**



యాదాద్రి భువనగిరి, ప్రజా స్ఫూర్తి : 25 సంవత్సరాల క్రితం మొదలు పెట్టిన తెలంగాణ ఉద్యమం. ఎందరో తెలంగాణ విద్యార్థుల అమరుల త్యాగఫలం ఈ తెలంగాణ రాష్ట్రం.. 14 సంవత్సరాలు తెలంగాణ ఉద్యమాన్ని నడిపించి భారతదేశంలో ఒక సువర్ణ తెలంగాణను స్థాపించినఏకైక వ్యక్తి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు గత పది సంవత్సరాల కాలంలో తెలంగాణ రాష్ట్రంలో బడుగు బలహీనవర్గాలకు మరియు నిరుద్యోగులకు విద్యార్థులకు రైతులకు ఎన్నో అవకాశాలు కల్పించిన అపర భగీరథుడు చంద్రశేఖర రావు సంక్షేమ పథకాలతో పల్లెల్లో వెలుగు నింపిన తెలంగాణ సూర్యుడు మన చంద్రశేఖర రావు బంగారు తెలంగాణ గా ఏర్పడ్డ తెలంగాణను అప్పుల తెలంగాణగా గుర్తింపు తెచ్చినటువంటి ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం.. సంవత్సర కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణను 20 సంవత్సరాలకు వెనుక నెట్టి రాష్ట్ర ప్రజలను ఇబ్బంది పాలు చేస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం, మళ్లీ తెలంగాణ అభివృద్ధి చెందాలంటే మళ్లీ తెలంగాణకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు మళ్లీ సారధ్యం వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది... కావున వరంగల్లో జరిగే రజతోత్సవ సభను భువనగిరి నియోజకవర్గం లో ఉన్నటువంటి ప్రజలందరూ కూడా పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరారు

## మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



రాజపేట, ప్రజాస్ఫూర్తి : ఏఐటీయూసీ అనుబంధ సంఘమైన బిల్డింగ్ కన్స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ 4వ, మహాసభల పోస్టర్ ను రాజాపేట మండలం బేగంపేట గ్రామంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి జెల్ల బాహూపేట వెంకటయ్య, సిపిఐ మండల కార్యదర్శి చిగుర్ల లింగం లు ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై మే 20న, నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని కోరారు. కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ కార్మికులకు పెన్షన్లు గుర్తింపు కార్డులు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాలు నాలుగు లేబర్ కోడ్స్ గా మార్పు చేయడాని రద్దు చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో నిర్మాణ రంగంలో పనిచేస్తున్న లక్షల మంది నిర్మాణ కార్మికులైన తాపీ ఇటుక రాయి కంకర సెంట్రింగ్ రాడ్ బెండింగ్ ప్లంబర్ ఎలక్ట్రీషన్ వడ్రంగి కాంక్రీట్ మిక్సింగ్ పెయింటర్స్ మార్బుల్ రంగాలలో పనిచేసే కార్మికులందరికీ సంక్షేమ బోర్డులో సభ్యులుగా నమోదు చేసి ప్రభుత్వం సహాయ సహకారాలు అందించాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 21, 22 తేదీలలో శంషాబాద్ లో జరుగు మహాసభలకు కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొనే విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి మూల హరినాథ్, నీల నరసింహులు, కర్రె బాలరాజు, దేవి మల్లేశం, నీల జాంగిర్ పాల్గొన్నారు.

## యశోద కన్వెన్షన్ ప్రారంభం



యాదాద్రి భువనగిరి జిల్లా, (ప్రజాస్ఫూర్తి) : గుండాల మండలం అనంతారం గ్రామంలో యశోద కన్వెన్షన్ ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి కలిసి ప్రారంభించారు.యశోద కన్వెన్షన్ యజమానులు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ని,ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు.

## ఈస్టర్ వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



ఆలేరు , ప్రజా స్ఫూర్తి : లోక రక్షకుడైన ఏసుక్రీస్తు పునరుత్థానం పొందిన పవిత్ర ఈస్టర్ దినోత్సవం సందర్భంగా ఆలేరు మండలం కొలనుపాకలోని చర్చిలో ఆలేరు ఎమ్మెల్యే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ,భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే బీర్ల ఆయిలయ్య క్రైస్తవ సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ శిలువపై మరణించిన ఏసు పునరుత్థానం పొందిన ఈస్టర్ దినోత్సవం క్రైస్తవుల మత విశ్వాసంలో ఒక పవిత్ర పుణ్య దినంగా మారింది. నూతన ఆశయాలతో జీవితాన్ని కొనసాగించాలని అన్నారు .

## ఛలో వరంగల్ సభ వాల్ పోస్టర్ ఆవిష్కరణ




యాదగిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ రాష్ట్ర సాధనకై ఏర్పడిన భారత రాష్ట్ర సమితి పార్టీ 25 సంవత్సరాలు పూర్తి చేసుకుని వజ్రోత్సవ సభ 27 ఏప్రిల్ రోజున ఎల్కతుర్తి ఎక్స్ రోడ్ వరంగల్ జరగబోయే మహాసభ విజయవంతం చేయాలని మల్లాపురం గ్రామ శాఖ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు ఆలేరు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు గొంగిడి సునీత మహేందర్ రెడ్డి నిర్వాహణలో భాగంగా మండల పార్టీ అధ్యక్షులు కర్రె వెంకటయ్య ఆదేశాల మేరకు వాల్ పోస్టర్ రిలీజ్ చేసి అనంతరం కర్రె చంద్రశేఖర్, మాట్లాడుతూ వజ్రోత్సవ సభకు మల్లపురం గ్రామ బీఆర్ఎస్ తరపున భారీ ఎత్తున జనసమీకరణ చేసి కార్యక్రమం విజయవంతం చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో దుద్దురు సిద్ధులు, పారుపల్లి మైసిరెడ్డి ,గోపి విజయ్ ,గవ్వల నవీన్, కర్రే నితిన్ ,భూషోల్ల స్వామి, కర్రె మధు , తంబడి బాల నరసయ్య, కర్రె మధు, తదితరులు పాల్గొన్నారు.

# ఒకే గుడి, ఒకే బావి.. మోహన్ భగవత్ పిలుపు

దిల్లీ: కుల భేదాలకు స్వస్తి పలకాలని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భగవత్ హిందూ కమ్యూనిటీ ప్రజలకు పిలుపునిచ్చారు. "ఒకే గుడి, ఒకే బావి, ఒకే శ్మశాన వాటిక" అనే సూత్రానికి మనమంతా కట్టుబడి ఉండాలని సూచించారు. దీన్ని పాటిస్తూ సామాజిక సామరస్యానికి కృషి చేయాలని కోరారు. అలీగఢ్‌లో ఐదు రోజుల పర్యటనలో ఉన్న మోహన్ భగవత్ అక్కడ జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హిందూ విలువల ప్రాముఖ్యతను చెప్పారు. "ప్రపంచవ్యాప్తంగా శాంతి సాధించడానికి ముందుగా.. భారత్ సామాజిక ఐక్యత సాధించడం కీలకం. హిందూ సమాజానికి పునాదిగా భావించే సంస్కారం (విలువలు), సంప్రదాయం, సాంస్కృతిక విలువలు, నైతిక సూత్రాల పేరుతో ఆ చీకటి లోయల లోతుల్లో పాతుకుపోయిన ఈ సమాజ ఆలోచన తీరును నిర్మూలించాలి. కుల భేదాలకు స్వస్తి పలకాలి" అని



పిలుపునిచ్చారు. "నైతిక విలువలను పాటిస్తూ సమాజంలోని అన్ని వర్గాలను కలుపుకొని పోవాలి. ఎలాంటి భేదాలు చూపకుండా అన్ని వర్గాల వారిని ఇళ్లలోకి ఆహ్వానించాలి. అట్టడుగు స్థాయిలో సామరస్యం, ఐక్యతను వ్యాప్తి చేయాలి. సంస్కారం అనే పునాదిపై నుంచి కుటుంబం, దాని విలువలు రూపుదిద్దుకున్నాయి. ఇది సమాజంలో ప్రాథమిక యూనిట్‌గా ఉంటోంది. జాతీయవాదం, సామాజిక ఐక్యత పునాదులను మరింత బలోపేతం చేసేందుకు అన్ని పండుగలను సామూహికంగా నిర్వహించడం ఎంతో ముఖ్యం" అని పేర్కొన్నారు.



## రాక్రేల మధ్య చర్చలు!
### - సంజయ్ రౌత్

రెండు దశాబ్దాలుగా విరోధులుగా ఉన్న నవనిర్మాణ్ సేన, శివసేనల అధ్యక్షులు త్వరలో కలిసి పోనున్నారనే వార్తలు మహారాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తిగా మారాయి. దీనిపై తాజాగా ఉద్ధవ్ సేన ఎంపీ సంజయ్ రౌత్ మీడియాతో మాట్లాడుతూ.. రాజకీయ పొత్తుకు సంబంధించి ఎటువంటి సంప్రదింపులు జరగలేదని, కేవలం వీరి మధ్య భావోద్వేగ చర్చలు మాత్రమే జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ''రాజకీయ పొత్తు లేదు. కేవలం భావోద్వేగ చర్చలు మాత్రమే జరుగుతున్నాయి'' అని సంజయ్ రౌత్ వెల్లడించారు. అయితే, భవిష్యత్తులో రాజకీయంగా ఏకమవుతారా అన్న అంశాన్ని మాత్రం ఆయన తోసిపుచ్చలేదు. సోదరులిద్దరూ నిర్ణయం తీసుకుంటారు అని చెప్పారు. మహారాష్ట్ర ప్రజలు, మరాఠీ భాష ప్రయోజనాల కోసం ఉద్ధవ్‌తో కలిసి పని చేసేందుకు ఎటువంటి అభ్యంతరం లేదని రాజ్ ఠాక్రే ఇటీవల పేర్కొన్న సంగతి తెలిసిందే. ఇందుకు ఉద్ధవ్ కూడా సానుకూలంగా స్పందించడంతో ఇరువురు ఏకం కానున్నారనే వార్తలు విస్తృతమయ్యాయి. అయితే, గత లోక్‌సభ ఎన్నికల ముందు ఎన్డీయేకు మద్దతిచ్చిన రాజ్ ఠాక్రే.. విపక్ష శివసేన (యూబీటీ)తో కలిసి పనిచేస్తే మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామమే అవుతుంది.

## నా కలను సాకారం చేసింది ఆయనే : లలిత్ మోదీ

ఐపీఎల్ కార్యరూపం దాల్చడంలో శరద్ పవార్ పాత్ర ఎంతో ఉందని లలిత్ మోదీ పేర్కొన్నాడు. ఈ ఆటను గ్లోబల్ ఐకాన్‌గా నిలిపిన ఆ సీనియర్ నేతను మరచిపోవద్దన్నారు. ఐపీఎల్ రూపకల్పనలో పవార్ కీలకంగా వ్యవహరించారని పేర్కొంటూ ఆంగ్ల పత్రికలో వచ్చిన ఓ వార్తా కథనాన్ని ప్రస్తావిస్తూ లలిత్ ఈ విధంగా స్పందించారు. ''ఇది అక్షరాల నిజం. శరద్ పవార్ వల్లే అది సాధ్యమైంది. ఆయన నాపై ఉంచిన విశ్వాసం, 100శాతం ప్రోత్సహించడం వల్లే ఐపీఎల్ కార్యరూపం దాల్చింది. ఈ విషయంలో మనందరం ఆయనకు



ధన్యవాదాలు చెప్పాలి. నా కలను ఆయన సాకారం చేశారు. పవార్ దార్శనికతను ఎన్నడూ మరచిపోవద్దు. ఈ విషయంలో ఆయనకు సెల్యూట్'' అని లలిత్ మోదీ తన సామాజిక మాధ్యమ ఖాతాల్లో పోస్టు చేశాడు. ముంబయిలోని వాంఖడే స్టేడియంలోని ఓ విభాగానికి శరద్ పవార్ పేరు పెట్టాలని ముంబయి క్రికెట్ అసోసియేషన్ (MCA) ఇటీవల తీసుకున్న నిర్ణయంపై సామాజిక మాధ్యమాల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఐపీఎల్‌లో శరద్ పవార్ పాత్రకు సంబంధించి మీడియాలో కథనాలు వచ్చాయి. ఇదిలాఉంటే, శరద్ పవార్ ముంబయి క్రికెట్ అసోసియేషన్‌కు అనేక పర్యాయాలు అధ్యక్షుడిగా పనిచేశారు. 2005 నుంచి 2008 వరకు బీసీసీఐ అధ్యక్షుడిగా, 2010 నుంచి 2012 వరకు ఐసీసీ అధినేతగానూ సేవలందించారు.

## జమ్మూ కశ్మీర్‌లో వర్ష బీభత్సం..ముగ్గురు మృతి

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. రెండు రోజులుగా ఆగకుండా కురుస్తున్న కుండపోత వానల కారణంగా భారీగా కొండచరియలు విరిగి పడుతున్నాయి. రాంబన్ జిల్లాలో దాదాపు 40 ఇళ్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. వరదలో చిక్కుకొని ముగ్గురు మరణించగా.. సుమారు 100మందిని సహాయక బృందాలు రక్షించినట్లు అధికా రులు పేర్కొన్నారు. చాలా చోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని అధికారులు పేర్కొన్నారు. కొండ చరియలు విరిగి పడడంతో ప్రధాన మార్గాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. శిథిలాల కింద వాహనాలు చిక్కుకుపోయినట్లు చెబుతున్నారు. పశ్చిమాసియాలోని ప్రత్యేకమైన వాతావరణ పరిస్థితుల వల్లే జమ్మూలో భారీ వర్షాలు, తుఫాను సంభవించిందని వాతావరణ శాఖ తెలిపింది. ఐదేళ్లలో ఇంత భారీ స్థాయిలో వర్షాలు, బలమైన గాలులు వీయడం



ఇదే మొదటిసారని పేర్కొంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా వరదలు చీనాబ్ వంతెన సమీపంలోని ధరంకుండ్ గ్రామాన్ని ముంచెత్తాయని అధికారులు పేర్కొన్నారు. దీంతో ఇళ్లు వాహనాలు కొట్టుకుపోయాయని.. ఇళ్లలోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి సహాయ బృందాలు శ్రమిస్తున్నాయని తెలిపారు. దీనిపై కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ స్పందిస్తూ.. డిప్యూటీ కమిషనర్ బషీర్‌ఉల్‌హక్ చౌదరితో తాను నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నానని చెప్పారు. ఆర్థిక, ఇతర సహాయాన్ని అందిస్తున్నామని అన్నారు. ఘటనపై జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా స్పందిస్తూ..ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసరం అయితే తప్ప బయటకు వెళ్లొద్దని సూచించారు. రాంబన్‌లో కొండ చరియలు విరిగిపడడం వల్ల తీవ్ర ఆస్తి నష్టం సంభవించిందన్నారు. విపత్తు ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని అన్నారు.

## నీతీశ్‌ది కుర్చీలాట.. అదో అవకాశవాద కూటమి: ఖర్గే

బిహార్‌లో జేడీయూ, భాజపా సంకీర్ణ ప్రభుత్వంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శలు గుప్పించారు. అదో అవకాశవాద కూటమి అని పేర్కొన్నారు. నీతీశ్ కుమార్ సీఎం కుర్చీ కోసం పార్టీలు మారుతుంటారని ఆరోపించారు. బిహార్‌లోని బక్సర్‌లో నిర్వహించిన పార్టీ సభలో పాల్గొన్న ఖర్గే ఈ మేరకు ప్రసంగించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో ఎన్డీయే సర్కారును అధికారం నుంచి తప్పించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ''బిహార్‌లో నీతీశ్ పార్టీ, భాజపాది అవకాశవాద పొత్తు. రాష్ట్ర ప్రజలకు ఇది మేలు చేకూర్చదు. ముఖ్యమంత్రి పదవి కోసం నీతీశ్ కుమార్ పార్టీలు మారుతుంటారు. మరోవైపు.. ప్రధాని మోదీ అబద్ధాల ఫ్యాక్టరీ నడుపుతున్నారు. బిహార్‌కు ఇస్తామన్న రూ.1.25 లక్షల కోట్ల ప్యాకేజీ హామీ ఏమైంది? ఈ విషయంపై ముఖ్యమంత్రిని రాష్ట్ర ప్రజలు నిలదీయాలి'' అని ఖర్గే వ్యాఖ్యానించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో 'మహాగర్‌బంధన్'కు ఓటేయాలని, ఎన్డీయే సర్కారును గద్దె దించాలని విజ్ఞప్తి చేశారు. నేషనల్ హెరాల్డ్ కేసులో ఇటీవల కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై ఈడీ ఛార్జిషీటు



నమోదు చేయడాన్ని ఖర్గే ఖండించారు. కాంగ్రెస్‌ను లక్ష్యంగా చేసుకునేందుకే ఇలా చేశారని ఆరోపించారు. తమ నేతలు భయపడరని.. ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీలు దేశం కోసం ప్రాణాలర్పించారని గుర్తుచేశారు. పేదలు, మహిళలు, బలహీనవర్గాలకు భాజపా, ఆరెస్సెస్‌లు వ్యతిరేకమని విమ ర్శించారు. కులమతాల ఆధారంగా సమా జాన్ని విభజించాలని చూస్తాయని, వక్ఫ్ చట్టం దీనికి ఉదాహరణ అని పేర్కొన్నారు.

## ఆగిఉన్న ఇండిగో విమానాన్ని ఢీకొట్టిన టెంపో..

బెంగళూరులోని కెంపెగౌడ విమానాశ్రయంలో త్రుటిలో ప్రమాదం తప్పింది. శనివారం ఆగిఉన్న ఇండిగో విమానాన్ని ట్రావెలర్ టెంపో ఢీకొన్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రమాదం జరిగిన సమయంలో డ్రైవర్ మాత్రమే వాహనంలో ఉన్నాడు. ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదని అధికారులు పేర్కొన్నారు. ఈ టెంపో ఆకాశ ఎయిర్ సిబ్బందిని వారి కార్యాలయం నుంచి ఎయిర్‌క్రాఫ్ట్ బే వద్దకు తీసుకురావడానికి వినియోగిస్తున్నారని తెలిపారు. డ్రైవర్ నిద్రమత్తులో ఉన్న కారణంగా ఈ ప్రమాదం జరిగిందని



ప్రాథమిక దర్యాప్తులో గుర్తించామన్నారు. ఈ ప్రమాదం వల్ల పలు విమాన సర్వీసుల్లో స్వల్ప అంతరాయం కలిగిందని..తర్వాత వాటిని పునరుద్ధరించామని అన్నారు. ఈ ఘటనపై ఇండిగో స్పందిస్తూ.. బెంగళూరు ఎయిర్‌పోర్టులో ఆగి ఉన్న విమానాన్ని టెంపో ఢీకొట్టడంపై తమకు సమాచారం అందిందని ఈ విషయంపై జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్‌కు సమాచారం వెల్లడించినట్లు తెలిపింది. ప్రయాణికుల భద్రత, సౌకర్యాలకు తాము అధిక ప్రాధాన్యం ఇస్తామని.. ఈ విషయంపై ఎయిర్‌లైన్స్ విచారణ జరిపి చర్యలు తీసుకుంటుందని పేర్కొంది.

## ఈస్టర్ వేళ.. బైడెన్‌పై విరుచుకుపడ్డ ట్రంప్!

అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్ సహా పలువురిపై డొనాల్డ్ ట్రంప్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈస్టర్ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలిపిన ఆయన బైడెన్ సహా పలువురు న్యాయమూర్తులు, దర్యాప్తు అధికారులను లక్ష్యంగా చేసుకొని ధ్వజమెత్తారు. వారి చర్యల వల్లే దేశంలో అక్రమ వలసదారులు పెరిగారని దుయ్యబట్టారు. ''హంతకులను, మాదకద్రవ్యాల వ్యాపారం చేసేవారిని, ప్రమాదకరమైన నేరస్థులను, ఎంఎస్13 గ్యాంగ్ సభ్యులను, గృహహింసకు పాల్పడేవారిని మన దేశంలోకి తీసుకువచ్చేందుకు పోరాడుతున్న, కుట్ర పన్నుతున్న వారికి సహా అందరికీ ఈస్టర్ శుభాకాంక్షలు. ఇటువంటి వ్యక్తులు మన దేశంపై హింసాత్మక దాడులకు పాల్పడేందుకు అనుమతిస్తున్న అసమర్థ న్యాయమూర్తులు, దర్యాప్తు అధికారులకు కూడా శుభాకాంక్షలు'' అని డొనాల్డ్ ట్రంప్ వ్యంగ్యంగా పోస్టు పెట్టారు.

# స్టైలే కాదు.. కంఫర్ట్ కూడా ముఖ్యం..

## సమ్మర్‌లో ఏ దుస్తులు బెటర్ ?



చాలామంది యువతీ యువకులు ట్రెండీ, ఫ్యాషన్ దుస్తులను వేసుకోవడానికి ఇష్టపడుతుంటారు. కంఫర్ట్ కంటే కూడా స్టైల్‌కే ప్రయారిటీ ఇస్తుంటారు. కానీ వేసవిలో ఇది నష్టం చేస్తుంది అంటున్నారు నిపుణులు. ఉక్కబోతల కారణంగా బిగుతైన మందపాటి దుస్తులు, స్కిన్నీ జీన్స్ వంటివి స్కిన్ హెల్త్‌పై ప్రతికూల ప్రభావం చూపుతాయి. అందుకే ఈ సీజన్‌లో ఫ్యాషన్, స్టైల్ వంటి వాటికంటే కంఫర్ట్‌కే ప్రయారిటీ ఇవ్వడం బెటర్.



* **లినిన్ క్లాతింగ్ :** వేసవిలో ఉక్కబోతల నుంచి ఉపశమనం కోసం లినిన్ లేదా లినిన్ బ్లెండెడ్ క్లాతింగ్స్ బాగుంటాయని నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు ఇవి ఇండియన్ స్టైలిష్ అండ్ వెస్ట్రన్ స్టైలిష్ లుక్స్ ఇచ్చేవి కూడా ఉంటాయి. ఎల్లప్పుడూ ట్రెండింగ్‌లో ఉండే దుస్తులు కూడాను. ఇందులో లైట్ కలర్స్, వైట్ కలర్స్, లైట్ గ్రీన్ వంటివి వేసవిలో ఎంపిక చేసుకోవడం కంఫర్ట్‌గా ఉంటాయంటున్నారు నిపుణులు.
* **ఖాదిమ్ క్లాతింగ్స్ :** ఖాదీ లేదా ఖాదిమ్ దుస్తులకు ఎప్పుడూ డిమాండ్ ఎక్కువే. వీటిలోనూ అనేక వెరైటీలు ఉంటాయి. సమ్మర్‌లో వీటిని ధరించడం వల్ల మిగతా దుస్తులతో పోలిస్తే ఉక్కబోతల నుంచి ఉపశమనం కలిగిస్తాయి. అయితే ఇవేవో పెద్దలు మాత్రమే ధరిస్తారనుకుంటే పొరపాటే.. యువతకు నచ్చే స్టైలిష్ దుస్తులు కూడా ఇప్పుడు మార్కెట్లో లభిస్తున్నాయి. వన్ పీస్ క్లాతింగ్స్, టూనిక్స్ వంటి మోడ్రన్ లుక్స్ ఇచ్చే ఫ్రాక్స్, టాప్స్, కఫ్తాన్లు కూడా దొరుకుతాయి. వేసవిలో ధరిస్తే కంఫర్టుగా ఉంటాయి.
* **లూజ్ డెనిమ్స్ :** సమ్మర్‌లో బిగుతైన దుస్తులు చిరాకు పుట్టిస్తాయి. కాబట్టి ఈ సీజన్లో స్టైలిష్ లుక్‌తో పాటు కంఫర్టుగా ఉండాలంటే లూజ్ డెనిమ్ ప్యాంట్స్, ఫ్లేర్డ్ జీన్స్, డెనిమ్ స్కర్ట్ వంటివి బెటర్. పైగా ఈ బాటమ్స్ అన్ని రకాల టాప్స్ మీద ధరించవచ్చు. సౌకర్యంగానూ, స్టైలిష్‌గానూ ఉంటాయి. వీటితోపాటు ప్రస్తుతం ఆర్ట్ సెట్, లేయరింగ్ క్లాతింగ్స్ కూడా ట్రెండింగ్‌లో ఉన్నాయి.
* **కాటన్ దుస్తులు :** వేసవిలో అన్నింటికంటే కంఫర్ట్‌గా ఉండేవి కాటన్ దుస్తులే అంటారు చాలామంది. ఇవి ఉక్కబోతల నుంచి ఉపశమనం కలిగిస్తాయి. ప్రస్తుతం ట్రెండీ లుక్‌లోనూ అనేక రకాలు లభిస్తున్నాయి. కాకపోతే వాషింగ్ సమయంలో కలర్ షేడ్ కాని దుస్తులను ఎంచుకోవడం బెటర్.

# ఐక్యూ పవర్‌ను మెరుగుపర్చి

# ఏకాగ్రతను పెంచే 10 బెస్ట్ చిట్కాలు

**మీ IQ పవర్‌ని పెంచడానికి, మీ దృష్టిని మెరుగుపరచడానికి తాజాగా నిపుణులు పది బెస్ట్ చిట్కాలు సూచించారు. విద్యార్థులు, పని చేసే నిపుణులు ఎవరికైనా సరే యూస్ అయ్యే ఈ టిప్స్ ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం..**



* **రోజూ చదవండి..**

పఠనం పదజాలం, అవగాహన, మానసిక విధులను మెరుగుపరుస్తుంది. ప్రతిరోజూ పుస్తకాలు, కథనాలు లేదా వార్తాపత్రికలు చదవండి. ఇది మీ మెదడును మేల్కొల్పుతుంది. ఏకాగ్రతను పెంచి.. మీ స్కిల్స్‌ను మెరుగుపరుస్తుంది.

* **బుద్ధిపూర్వక ధ్యానం సాధన చేయండి..**

ప్రతిరోజూ 10 నిమిషాల ధ్యానం కూడా దృష్టి, జ్ఞాపకశక్తి, భావోద్వేగ నియంత్రణను మెరుగుపరుస్తుంది. మైండ్‌ఫుల్‌నెస్ పరధ్యానాన్ని నివారించడానికి మీ మెదడుకు శిక్షణ ఇస్తుంది. ఎక్కువ కాలం పాటు ఏకాగ్రత వహించే సామర్థ్యాన్ని పెంచుతుంది.

* **బ్రెయిన్ గేమ్స్ ఆడండి..**

సుడోకు, చెస్, క్రాస్‌వర్డ్ పజిల్స్ వంటి ఆటలు మీ మెదడుకు సవాలు విసురుతాయి. ఇవి మీ సమస్య పరిష్కార సామర్థ్యాలను పరీక్షిస్తాయి. విమర్శనాత్మక ఆలోచనను పెంచుతాయి. మొత్తం మెదడు పనితీరు, తెలివితేటలను మెరుగుపరుస్తాయి.

* **తగినంత నిద్ర పొందండి..**

మెమరీ కన్సాలిడేషన్ అండ్ మెదడు కార్యకలాపాలకు నిద్ర ముఖ్యం. రోజులో శ్రద్ధ, నేర్చుకునే సామర్థ్యం, మానసిక పదును మెరుగుపరచడానికి 79 గంటల నాణ్యమైన నిద్రను పొందండి.

* **క్రమం తప్పకుండా వ్యాయామం చేయండి..**

వ్యాయామం మెదడుకు రక్త ప్రవాహాన్ని పెంచుతుంది. అలాగే కొత్త న్యూరల్ కనెక్షన్ల ఏర్పాటును ప్రోత్సహిస్తుంది. రోజుకు కేవలం 30 నిమిషాల నడక, జాగింగ్ లేదా యోగా మీ మానసిక స్థితి, ఏకాగ్రత, IQని పెంచుతుంది.

* **మెదడును ఉత్తేజపరిచే ఆహారాలు తినండి..**

మీ ఆహారంలో అక్రోట్లను, బ్లూబెర్రీస్, ఆకుపచ్చ ఆకులు, కొవ్వు చేపలను చేర్చండి. అవి మీ మెదడుకు ఆహారం ఇస్తాయి. జ్ఞాపకశక్తిని పెంచుతాయి. దీర్ఘకాలికంగా మానసికంగా కూడా బాగుంటారు.



* **ఏదైనా కొత్త భాష నేర్చుకోండి..**

ఏదైనా కొత్తగా నేర్చుకోవడానికి ప్రయత్నించినప్పుడు ఐక్యూ పవర్ పెరుగుతుంది. ఉదాహరణకు కొత్త భాష నేర్చుకోవడం వంటిది. సంగీత వాయిద్యం లేదా కొత్త భాష నేర్చుకోవడం మీ మనస్సును పదునుగా ఉంచుతుంది. దీర్ఘకాలంలో మీ IQని పెంచుతుంది.

* **మల్టీ టాస్క్ చేయవద్దు..**

ఒకేసారి చాలా విషయాలపై దృష్టి కేంద్రీకరించడం వల్ల ఏకాగ్రత, గుర్తుంచుకోగల సామర్థ్యం తగ్గుతుంది. మీ అటెన్షన్ కెపాసిటీ, ఉత్పాదకతను పెంపొందించడానికి ఒక సమయంలో ఒక విషయంపై దృష్టి కేంద్రీకరించడాన్ని ప్రాక్టీస్ చేయండి.

* **విజువలైజేషన్ పద్ధతులను ప్రాక్టీస్ చేయండి..**

లక్ష్యాలు లేదా ఆలోచనలను దృశ్యమానం చేయడం జ్ఞాపకశక్తి, శ్రద్ధను ఏకీకృతం చేస్తుంది. మనస్సులోని ఇమేజరీ ఊహాశక్తిని మెరుగుపరుస్తుంది. సమాచారాన్ని తక్షణమే నిల్వ చేసే.. తిరిగి పొందగల మీ సామర్థ్యాన్ని వేగవంతం చేస్తుంది.

* **ఆసక్తిగా ఉండండి & ప్రశ్నలు అడగండి..**

ఆసక్తిగల మెదడు నిరంతరం నేర్చుకునేది. కాగా ప్రశ్నలు అడగండి. ఏదైనా విషయంపై దర్యాప్తు చేయండి. మీ పరిసరాలతో నిమగ్నమై ఉండండి. ఇది మానసిక చురుకుదనాన్ని పెంపొందించడంలో, విమర్శనాత్మక ఆలోచనా పద్ధతులను మెరుగుపరచడంలో సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు.

## ఇక తగ్గదేమో..!
# పసిడి ప్రియులకు అలెర్ట్..



**న్యూఢిల్లీ:** ఒక్క అడుగు. ఒకే ఒక్క అడుగు. బంగారం లక్ష రూపాయల మార్క్‌కు చేరడం ఇక లాంఛనమే. ఒక్క అడుగు వెనక్కేస్తే, రెండు అడుగులు ముందుకు అన్నట్లుగా బంగారం పరుగులు కనిపిస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా పసిడి ధర ఆల్‌టైమ్ హైకి ఎగబాకి.. లక్ష మార్కుకు చేరువ కావడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.. దీనికి కారణం అంతర్జాతీయంగా ఏర్పడిన ఆర్థిక ఉద్రిక్తతలు.. అమెరికా, చైనాల మధ్య సుంకాల పోరు.. ఇలా పలు కారణాలతో పసిడి ధర రికార్డు స్థాయికి చేరింది. ప్రస్తుతం బులియన్ మార్కెట్‌లో స్వచ్ఛమైన పసిడి ధర 98వేల మార్కుకు చేరువలో ఉంది. తాజాగా.. బంగారం, వెండి ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి.. 20 ఏప్రిల్ 2025 శనివారం ఉదయం ఆరు గంటల వరకు పలు వెబ్‌సైట్లలో నమోదైన ధరల ప్రకారం.. దేశీయంగా 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.89,450, 24 క్యారెట్ల పది గ్రాముల గోల్డ్ ధర రూ.97,580 గా ఉంది. వెండి కిలో ధర రూ.100,000 లుగా ఉంది. కాగా.. ప్రాంతాల వారీగా బంగారం, వెండి ధరల్లో వ్యత్యాసం ఉంటుంది.

**బంగారం ధరలు..**

హైదరాబాద్‌లో 22 క్యారెట్ల బంగారం ధర రూ.89,450, 24 క్యారెట్ల ధర రూ.97,580 గా ఉంది. విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో 22 క్యారెట్ల బంగారం ధర రూ.89,450, 24 క్యారెట్ల ధర రూ.97,580గా ఉంది. ఢిల్లీలో 10 గ్రాముల 22 క్యారెట్ల పసిడి ధర రూ.89,600, 24 క్యారెట్ల ధర రూ.97,730 గా ఉంది. ముంబైలో 22 క్యారెట్ల ధర రూ.89,450, 24 క్యారెట్ల ధర రూ.97,580 గా ఉంది. చెన్నైలో 22 క్యారెట్ల ధర రూ.89,450, 24 క్యారెట్ల రేటు రూ.97,580 గా ఉంది. బెంగళూరులో 22 క్యారెట్ల ధర రూ.89,450, 24 క్యారెట్ల ధర రూ.97,580 గా ఉంది.

**వెండి ధరలు..**

హైదరాబాద్‌లో కిలో వెండి ధర రూ.1,10,000 విజయవాడ, విశాఖపట్నంలో రూ.1,10,000 ఢిల్లీలో వెండి కిలో ధర రూ.1,00,000 ముంబైలో రూ.1,00,000 బెంగళూరులో రూ.1,00,000 చెన్నైలో రూ.1,10,000 లుగా ఉంది.

## గులాబీ సిరప్‌లోని ప్రతి చుక్క
# 'జాతీయ సేవ'కు అంకితం..
### గొప్ప సంకల్పంతో ముందుకొచ్చిన పతంజలి!




**ఉత్తరాఖండ్:** యోగా, ఆయుర్వేద రంగంలో బాబా రామ్‌దేవ్, ఆచార్య బాలకృష్ణ ద్వయం తమకంటూ ప్రత్యేకత చాటుకుంటున్నారు. పతంజలి ఆయుర్వేద ఇన్‌స్టిట్యూట్ ద్వారా ఆరోగ్యం, ఫిట్‌నెస్‌కు సంబంధించి ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయుర్వేద, మూలికా ఉత్పత్తులకు ప్రసిద్ధి చెందిన ఈ సంస్థ సహజ, సాంప్రదాయ భారతీయ పానీయాలను ప్రవేశపెట్టింది. ఆయుర్వేద, కార్బోనేటేడ్ నీటి ఆధారిత పానీయాలు, సోడా ఆధారిత పానీయాలు, కెఫిన్ ఆధారిత పానీయాల హానికరమైన ప్రభావాల నుండి దేశ ప్రజలను రక్షించడానికి వీటిని అందుబాటులోకి తీసుకువచ్చింది.

వేసవిలో దాహార్తి తీర్చేందుకు గులాబీ షర్బత్, మామిడి ఆధారిత పండ్ల రసాలు, బేల్ షర్బత్, ఖుస్ షర్బత్ వంటి పానీయాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ షర్బత్ ద్వారా ప్రజల ఆరోగ్యానికి మాత్రమే సేవ చేయడమే కాకుండా, దేశానికి సేవ చేయాలనే తన సూత్రంపై కూడా పనిచేస్తోందని సంస్థ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. పతంజలి ఆయుర్వేద గులాబీ సిరప్ తయారీలో ఆయుర్వేద సాంప్రదాయ వంటకాన్ని ఉపయోగించిందని చెబుతోంది. అంతేకాదు, దీనిని తయారు చేసే పద్ధతిని కూడా సహజంగా ఉంటుందన్నారు. తద్వారా దాని సహజ లక్షణాలను కాపాడుకోవచ్చు. దీనికోసం, పతంజలి ఆయుర్వేద రైతుల నుండి నేరుగా గులాబీలను కొనుగోలు చేస్తుంది. తద్వారా మధ్యవర్తుల పాత్రను తగ్గించి, స్వచ్ఛంగా ఉండేలా చూస్తోంది. కల్తీ లేని ఆహార పదార్థాలను దేశ ప్రజలకు అందించాలన్న సంకల్పంతో పతంజలి పని చేస్తోంది. ఉత్తరాఖండ్‌లోని పతంజలి ఫుడ్ పార్క్‌లో మూలికల సేంద్రీయ వ్యవసాయం జరుగుతుంది. వీటిని ప్రజల ఆరోగ్యానికి మేలు చేసే ఉత్పత్తులను తయారు చేయడంలో ఉపయోగిస్తారు. పతంజలి ఆయుర్వేద బేల్, ఖుస్ సిరప్‌ను కూడా సాంప్రదాయ, సహజ పద్ధతిలో తయారు చేస్తుంది. అంతేకాదు, పతంజలి ఆయుర్వేద తన ఉత్పత్తులతో దేశానికి సేవ చేస్తుంది. ఆయుర్వేదానికి సేవ చేయడంతో పాటు, పతంజలి ఈ ఉత్పత్తుల నుండి వచ్చే ఆదాయంలో ఎక్కువ భాగాన్ని సమాజ సంక్షేమం కోసం ఖర్చు చేసింది. పతంజలి ఆయుర్వేద గులాబీ షర్బత్ తోపాటు ఇతర ఉత్పత్తుల నుండి లాభాలను ఆర్జిస్తుంది. ఇందులో కొంత భాగాన్ని గ్రామీణ మరియు గిరిజన ప్రాంతాలలోని పేద పిల్లలకు విద్యను అందించడానికి ఉపయోగిస్తారు. అందుకే పతంజలి ఆయుర్వేద గులాబీ సిరప్‌లోని ప్రతి చుక్క 'జాతీయ సేవ' అని పతంజలి హామీని ఇస్తుంది.

## అనుమతుల కోసం ప్రయత్నిస్తున్న ట్రూజెట్ సర్వీసులు




**హైదరాబాద్:** హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ప్రాంతీయ విమానయాన సంస్థ 'ట్రూజెట్' మళ్లీ తన విమాన సర్వీసులు ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది. ఇందుకోసం తన నిరభ్యంతర పత్రాన్ని (ఎన్ఓసీ) పునరుద్ధరించాలని కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ (ఎంఓసీఏ)కు ట్రూజెట్ దరఖాస్తు చేసినట్లు తెలిసింది. ఎంఓసీఏ ఇందుకు ఆమోదం తెలిపితే పౌర విమానయాన శాఖ డైరెక్టర్ జనరల్ (డీజీసీఏ) నుంచి కంపెనీ తన పాత ఎయిర్ ఆపరేషన్స్ పర్మిట్ (ఏఓపీ)ను పునరుద్ధరించుకోవాల్సి ఉంటుంది. వీటికి తోడు కంపెనీ బోర్డులోని సభ్యుల నియామకాలకూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అనుమతి అవసరం. ఈ అనుమతులన్నీ పూర్తి చేసి ఈ ఏడాది ఆగస్టు లేదా సెప్టెంబరు మధ్య కాలంలో హైదరాబాద్ నుంచి మళ్లీ కొద్దిపాటి ఏటీఆర్ టర్బో విమానాలతో ప్రాంతీయ విమాన సర్వీసులు ప్రారంభించాలని ట్రూజెట్ భావిస్తోంది.

# కోహ్లీ, పడిక్కల్ వీరవిహారం

### పంజాబ్‌పై ఆర్సీబీ ప్రతీకార విజయం



**ముల్లాన్‌పూర్:** ఐపీఎల్ 18వ సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ప్రతీకార విజయం సాధించింది. చిన్నస్వామిలో తమను చిత్తుగా ఓడించిన పంజాబ్ కింగ్స్‌పై 7 వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. తొలుత సుయాశ్ శర్మ(2-26), కృనాల్ పాండ్యా(2-25)ల విజృంభణతో పంజాబ్‌ను 157 కట్టడి చేసిన ఆర్సీబీ.. ఛేదనలో చెలరేగింది. ప్రత్యర్థి బౌలర్లకు ఏ మాత్రం అవకాశం ఇవ్వని విరాట్ కోహ్లీ(73 నాటౌట్) ఇప్యాంక్ట్ ప్లేయర్ దేవ్‌దత్ పడిక్కల్(61)లు హాఫ్ సెంచరీలతో హోరెత్తించారు. జితేశ్ శర్మ(11) సిక్సర్ బాదడంతో మరో 7 బంతులు ఉండగానే లక్ష్యాన్ని



ఛేదించింది బెంగళూరు.

సొంతగడ్డపై చతికిలపడుతూ.. ఇతర మైదానాల్లో విజయఢంకా మోగిస్తున్న ఆర్సీబీ అదే సంప్రదాయాన్ని కొనసాగించింది. పంజాబ్ కింగ్స్‌ను వాళ్ల ఇలాకాలో చిత్తుగా ఓడించి బదులు తీర్చుకుంది. 158 పరుగుల ఛేదనలో విరాట్ కోహ్లీ(73 నాటౌట్) క్లాస్ ఇన్నింగ్స్‌తో కదం తొక్కగా.. ఇప్యాంక్ట్ ప్లేయర్‌గా వచ్చిన దేవ్‌దత్ పడిక్కల్(61) ఖతర్నాక్ బ్యాటింగ్‌తో చెలరేగాడు. వీళ్లిద్దరి మెరుపులతో గెలుపు దిశగా దూసుకెళ్లిన ఆర్సీబీ.. 18.5 ఓవర్లలోనే లక్ష్యాన్ని చేరుకుని శ్రేయస్ అయ్యర్ బృందానికి పెద్ద షాకిచ్చింది.

ముల్లాన్‌పూర్‌లో పంజాబ్‌ను తక్కువ స్కోర్‌కే కట్టడి చేసిన ఆర్సీబీకి ఆదిలోనే అర్ష్‌దీప్ సింగ్ షాకిచ్చాడు. డేంజరస్ ఓపెనర్ ఫిల్ సాల్ట్(1)ను తన తొలి ఓవర్లోనే వెనక్కి పంపాడు. అయితే.. జట్టును గెలిపించే బాధ్యత తీసుకున్న విరాట్ కోహ్లీ(73 నాటౌట్), ఇంప్యాక్ట్ ప్లేయర్ దేవ్‌దత్ పడిక్కల్(61)తో కలిసి ధాటిగా ఆడాడు. చిన్నస్వామిలో నిప్పులు చెరిగిన పంజాబ్ పేసర్లు ఈసారి తేలిపోగా.. విరాట్, పడిక్కల్ బౌండరీలతో విరుచుకుపడ్డారు. 30 బంతుల్లోనే అర్ధ శతకం బాదిన పడిక్కల్ ఔటైనా.. విరాట్ మరింత చెలరేగాడు.

అర్ష్‌దీప్ బౌలింగ్‌లో ఫోర్ బాదిన అతడు.. ఆ తర్వాత చాహల్ బౌలింగ్‌లో వరుసగా 6, 4 కొట్టాడు. అయితే.. రజత్ పాటిదార్ సిక్సర్‌కు యత్నించి బౌండరీ లైన్‌వద్ద యాన్సెన్‌కు చిక్కాడు. అప్పటికి ఆర్సీబీ విజయానికి 15 రన్స్ అవసరం. నేహల్ వధేరా వేసిన 19వ ఓవర్లో జితేశ్ శర్మ(11 నాటౌట్) సిక్సర్ కొట్టి జట్టును గెలిపించాడు. దాంతో, ఈ ఎడిషన్‌లో ఐదో విజయం బెంగళూరు ఖాతాలో పడింది.

**శశాంక్, యాన్సెన్ పోరాటంతో..**

సొంత ఇలాకాలో పంజాబ్ కింగ్స్ ఆరంభం అదిరినా భారీ స్కోర్ కొట్టలేకపోయింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బౌలర్లు విజృంభించడంతో టాపార్డర్ విఫలమైంది. సుయాశ్ శర్మ(2-26), కృనాల్ పాండ్యా(2-25)లు తిప్పేయడంతో మిడిలార్డర్ చేతులెత్తేసింది. వందలోపే నాలుగు వికెట్లు కోల్పోయిన పంజాబ్‌ను జోష్ ఇంగ్లిస్ (29), శశాంక్ సింగ్(31 నాటౌట్), మార్కో యాన్సెన్(25)లు ఆదుకున్నారు. ఆర్సీబీ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్న శశాంక్, యాన్సెన్ డెత్ ఓవర్లలో విలువైన ఇన్నింగ్స్ ఆడారు. ఏడో వికెట్‌కు 43 రన్స్ జోడించిందీ ద్వయం. దాంతో, పంజాబ్ నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 157 పరుగులు చేసింది.

# గుజరాత్ కెప్టెన్‌కు షాక్

### స్లో ఓవర్ రేటుకు భారీ జరిమానా



**అహ్మదాబాద్:** ఐపీఎల్ 18వ సీజన్‌లో జోరు మీదున్న గుజరాత్ టైటాన్స్‌కు పెద్ద షాక్. కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు భారీ జరిమానా పడింది. ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో స్లో ఓవర్ రేటు కారణంగా రూ.12 లక్షల ఫైన్ విధించింది. ఈ సీజన్‌లో గుజరాత్ నిర్ణీత సమయానికి ఓవర్ల కోటా పూర్తి చేయకపోవడం ఇదే మొదటిసారి. దాంతో, రిఫరీ ఫైన్‌తో సరిపెట్టారు.

అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో శనివారం రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ టాస్ గెలిచింది. అయితే.. గిల్ సేన నిర్ణీత సమయంలో ఓవర్లు పూర్తి చేయలేకపోయింది. దాంతో, ఐపీఎల్ కోడ్ ఉల్లంఘన కింద గిల్‌కు రూ.12 లక్షల జరిమానా పడింది. ఒకవేళ రెండోసారి కూడా స్లో ఓవర్ రేటును గుర్తిస్తే ఫైన్ రెండింతలు అంటే.. రూ.24 లక్షలు కట్టాల్సి ఉంటుంది. ఇక మూడోసారి ఇదే పొరపాటు జరిగితే రూ.30 లక్షల జరిమానా.. ఒక మ్యాచ్ నిషేధం విధించే అవకాశం ఉంది.

**బట్లర్ విధ్వంసంతో..**

గుజరాత్ గడ్డపై తొలుత బ్యాటింగ్ చేసిన ఢిల్లీ సమిష్టి పోరాటంతో భారీ స్కోర్ చేసింది. కెప్టెన్ అక్షర్ పటేల్(33), అశుతోష్ శర్మ(37)లు చెలరేగడంతో ఢిల్లీ 20 ఓవర్లకు 203 రన్స్ కొట్టింది. ఛేదనలో జోస్ బట్లర్(97) సుడిగాలిలా విరుచుకుపడ్డాడు. అతడికి షెర్ఫానీ రూథర్‌ఫర్డ్(42) కీలక ఇన్నింగ్స్ ఆడడంతో గుజరాత్ 7 వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. రికార్డు లక్ష్యాన్ని ఛేదించి ఐదో విక్టరీ సాధించిన గిల్ బృందం.. టేబుల్ టాపర్‌గా నిలిచింది.

# డోప్ టెస్టుకు నిరాకరించిన అథ్లెట్లు.. కోచ్ నాగపురి రమేష్‌పై వేటు..!



**న్యూఢిల్లీ:** ప్రముఖ కోచ్ నాగపురి రమేష్‌పై వేటు పడింది. దేశం గర్వపడేలా యువ క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్న అతడిపై జాతీయ డ్రగ్స్ నిరోధక సంస్థ(నాడా) నిషేధం విధించింది. ఆయన వద్ద శిక్షణ పొందిన ఇద్దరు అథ్లెట్లు డోపింగ్ టెస్టుకు నిరాకరించడమే అందుకు కారణం. అయితే.. తానేమీ తప్పు చేయలేదని విచారణకు తాను సిద్ధంగా ఉన్నానని రమేష్ తెలిపాడు. డోప్ టెస్టుకు సహకరించనందుకు రమేష్‌తో పాటు కోచ్‌లు కరంవీర్ సింగ్, రాకేష్‌లు కూడా సస్పెన్షన్‌కు గురయ్యారు.

ఈమధ్యే కొందరు అథ్లెట్లు డోపింగ్ పరీక్షలకు నమూనాలు ఇచ్చేందుకు అంగీకరించలేదు. పరాస్ సింఘాల్, పూజా రాణి, నలుబోతు షన్ముగ శ్రీనివాస్, చెలిమి ప్రత్యూష, శుభమ్ మహరా, కిరణ్. జ్యోతిలు డోప్ టెస్టుకు తమ రక్త నమూనాలు ఇవ్వడానికి నిరాకరించారు. దాంతో, ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న నాడా అందుకు కోచ్‌లను బాధ్యులను చేస్తూ చర్యలు తీసుకుంది. ఈ క్రమంలోనే ద్రోణాచార్య అవార్డు గ్రహీత అయిన నాగపురి రమేశ్‌పై వేటు వేసింది.

అయితే.. నాడా తీరుపై రమేష్ మండిపడ్డాడు. నిజానిజాలు తెలుసుకోకుండా తనపై సస్పెన్షన్ విధించడం సరికాదని.. తానేమీ తప్పు చేయలేదని మీడియాకు వివరించాడీ కోచ్. తెలంగాణతో పాటు యావత్ దేశంలోని పలువురు యువ అథ్లెట్లు రమేష్ శిక్షణలో రాటుదేలుతున్నారు. ఆయన సూచనలతో, సలహాలతో మెరుగుపడిన స్ప్రింటర్ ద్యూతీ చంద్, జ్యోతి ఎర్రాజీలు ఒలింపిక్స్‌లో సత్తా చాటిన విషయం తెలిసిందే.

# ఫాంలోకి వచ్చిన హిట్ మ్యాన్

### సూర్య మెరుపు దాడి...
### ఈజీగా ఛేజింగ్ చేసిన ముంబయి
### చెన్నై సూపర్ కింగ్స్‌పై ముంబై ఇండియన్స్ 9 వికెట్ల తేడాతో ఘన విజయం
### రోహిత్ శర్మ (76), సూర్యకుమార్ యాదవ్ (68) అజేయ అర్ధ సెంచరీలు
### 177 పరుగుల లక్ష్యాన్ని 15.4 ఓవర్లలోనే ఛేదించిన ముంబై ఇండియన్స్





**ముంబై:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2025 సీజన్‌లో భాగంగా ఆదివారం నాడు వాంఖడే స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ అద్భుత ప్రదర్శనతో అదరగొట్టింది. చెన్నై సూపర్ కింగ్స్‌పై 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్ అజేయ అర్ధ శతకాలతో చెలరేగి జట్టుకు సునాయాస విజయాన్ని అందించారు. చెన్నై నిర్దేశించిన 177 పరుగుల లక్ష్యాన్ని ముంబై కేవలం 15.4 ఓవర్లలోనే ఒక వికెట్ మాత్రమే నష్టపోయి ఛేదించింది.

టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ముంబై ఇండియన్స్... చెన్నై సూపర్ కింగ్స్‌ను కట్టడి చేసే ప్రయత్నం చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన చెన్నై నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో ముంబై ఇండియన్స్‌కు శుభారంభం లభించింది. ఓపెనర్లు రియాన్ రికెల్టన్ (19 బంతుల్లో 24బీ 3 ఫోర్లు, 1 సిక్సర్), రోహిత్ శర్మ తొలి వికెట్‌కు 63 పరుగులు జోడించారు.

రికెల్టన్ ఔటైన తర్వాత క్రీజులోకి వచ్చిన సూర్యకుమార్ యాదవ్ (30 బంతుల్లో 68 నాటౌట్‌బీ 6 ఫోర్లు, 5 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. మరో ఎండ్‌లో రోహిత్ శర్మ (45 బంతుల్లో 76 నాటౌట్‌బీ 4 ఫోర్లు, 6 సిక్సర్లు) కూడా దూకుడుగా ఆడాడు. వీరిద్దరూ చెన్నై బౌలర్లపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తూ ఫోర్లు, సిక్సర్లతో విరుచుకుపడ్డారు. రెండో వికెట్‌కు అజేయంగా 114 పరుగులు జోడించి మరో 26 బంతులు మిగిలి ఉండగానే ముంబైకి చిరస్మరణీయ విజయాన్ని అందించారు.

చెన్నై బౌలర్లలో రవీంద్ర జడేజా ఒక్కడే వికెట్ తీయగలిగాడు. మిగిలిన బౌలర్లు భారీగా పరుగులు సమర్పించుకున్నారు. ఈ విజయంతో ముంబై ఇండియన్స్ పాయింట్ల పట్టికలో తమ స్థానాన్ని మరింత మెరుగుపరుచుకుంది. ముంబయికి ఇది వరుసగా మూడో విజయం కావడం విశేషం.

# ఎస్ఎస్ఎంబీ29 షూటింగ్ అప్‌డేట్..

## 3వేల మందితో భారీ యాక్షన్ సీక్వెన్స్




**టాకీస్:** ఆర్ఆర్ఆర్ లాంటి బ్లాక్‌బస్టర్ తర్వాత ప్రముఖ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి సూపర్ స్టార్ మహేశ్ బాబు కలిసి ఒక సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. ఎస్ఎస్ఎంబీ29 అనే వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రాన్ని దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కె.ఎల్. నారాయణ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. మహేశ్ - రాజమౌళి కాంబోలో వస్తున్న తొలి చిత్రం కావడంతో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాలో ప్రియంకా చోప్రా హీరోయిన్‌గా నటిస్తుండగా, మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్ పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. ఇప్పటికే ఒడిషా షెడ్యూల్ పూర్తి చేసుకున్న ఈ మూవీ షూటింగ్‌కి సంబంధించి తాజా అప్‌డేట్ వచ్చింది.

ఈ మూవీ షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతుండగా.. తదుపరి షెడ్యూల్‌లో భాగంగా నీటిలో ఒక భారీ బోట్ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరించేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ షెడ్యూల్‌లో మహేశ్ బాబు, ప్రియాంకా చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్‌తో పాటు సుమారు 3 వేల మంది జూనియర్ ఆర్టిస్ట్‌లు పాల్గొననున్నారని తెలుస్తోంది. వీరంతా ఈ సన్నివేశం కోసం ప్రత్యేక శిక్షణ తీసుకోనున్నారని సమాచారం. ఈ సీక్వెన్స్‌ను మే నుంచి జూన్ వరకు చిత్రీకరించనున్నారు. దీని కోసం హైదరాబాద్‌లో ఒక భారీ సెట్‌ను సిద్ధం చేస్తున్నారు. ప్రముఖ హాలీవుడ్ స్టంట్ డైరెక్టర్ల నేతృత్వంలో ఈ యాక్షన్ ఘట్టాన్ని షూట్ చేయనున్నట్లు తెలుస్తోంది.

# కారు ఫ్యాన్సీ నంబర్ కోసం రూ.7.75 లక్షలు పెట్టిన బాలకృష్ణ



**టాకీస్:** టాలీవుడ్ సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తన కారు కోసం ఫ్యాన్సీ నంబర్‌ను దక్కించుకున్నారు. ఖైరతాబాద్‌లోని ఆర్టీఏ కార్యాలయంలో జరిగిన వేలంలో రూ.7.75 లక్షలు చెల్లించి టీజీ09ఎఫ్0001 నంబర్‌ను సొంతం చేసుకున్నారు. బాలకృష్ణ త్వరలో రిజిస్టర్ చేయనున్న తన బీఎండబ్ల్యూ వాహనం కోసం ఈ నంబర్‌ను తీసుకున్నారు.

ఈ ఫ్యాన్సీ నంబర్ల వేలం ద్వారా ఖైరతాబాద్ జోన్‌లో ఒక్క రోజులోనే రవాణాశాఖకు రూ.37,15,645 ఆదాయం సమకూరింది. ఇతర ఫ్యాన్సీ నంబర్లలో టీజీ09ఎఫ్0099 నంబర్‌ను కాన్కాప్ ఎలక్ట్రికల్స్ సంస్థ రూ.4,75,999కి దక్కించుకుంది. టీజీ09ఎఫ్0009 నంబర్‌ను కమలాలయ హైసాఫ్ట్ సంస్థ, ఎఫ్0005 నంబర్‌ను జెట్టి ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ రూ.1,49,999కి, ఎఫ్0007 నంబర్‌ను శ్రీనివాసనాయుడు రూ.1,37,779కి, ఎఫ్0019 నంబర్‌ను నేత్రావతి బలగప్ప శివలిప్ప రూ.60 వేలకు సొంతం చేసుకున్నారు. అలాగే, గత సిరీస్‌లోని టీజీ09ఈ999 నంబర్‌ను ఈకో డిజైన్ స్టూడియో రూ.99,999కి దక్కించుకుంది.

సినిమా విషయానికి వస్తే.. ఇటీవల డాకు మహారాజ్ సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న బాలయ్య ప్రస్తుతం బోయపాటి శ్రీనుతో కలిసి అఖండ 2 సినిమాలో నటిస్తున్నాడు. ఈ చిత్రం వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది.

# ఈ సుకుమారి లేనిదే అందానికి విలువ లేదు..



**టాకీస్:** మీనాక్షి చౌదరి.. ఒక కథానాయకి, మోడల్, అందాల పోటీ టైటిల్ హోల్డర్. ఆమె తెలుగు తమిళ చిత్రాలలో పని చేస్తుంది. ఆమె ఫెమినా మిస్ ఇండియా 2018 పోటీలో హర్యానా రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించింది, అక్కడ ఆమె ఫెమినా మిస్ ఇండియా గ్రాండ్ ఇంటర్నేషనల్ 2018గా కిరీటాన్ని పొందింది. చౌదరి మిస్ గ్రాండ్ ఇంటర్నేషనల్ 2018లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించి, 1వ రన్నరప్‌గా నిలిచింది. 1 ఫిబ్రవరి 1997 సంవత్సరంలో హర్యానా రాష్ట్రంలోని పంచకులలో పుట్టి పెరిగింది అందాల భామ మీనాక్షి చౌదరి. ఈ ముద్దుగుమ్మ తండ్రి చౌదరి భారత ఆర్మీ సైన్యంలో కల్నల్ గా పని చేసారు. 2018 జనవరిలో అయన మరణించారు. చండీ గఢ్‌లోని సెయింట్ సోల్జర్ ఇంటర్నేషనల్ కాన్వెంట్ స్కూల్ నుండి పాఠశాల విద్యను పూర్తి చేసింది ఈ వయ్యారి. పంజాబ్‌లోని దేరా బస్సీలోని నేషనల్ డెంటల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ లో డెంటల్ సర్జరీలో బ్యాచిలర్ డిగ్రీని పూర్తి చేసింది. చదువుకున్న రోజుల్లో రాష్ట్ర స్థాయి స్విమ్మర్, బ్యాడ్మింటన్ క్రీడాకారిణిగా విజయాన్ని అందుకుంది ఈ బ్యూటీ. ఫెమినా మిస్ ఇండియా 2018 పోటీలో హర్యానా రాష్ట్రాని కి ప్రాతినిధ్యం వహించి ఫెమినా మిస్ ఇండియా గ్రాండ్ ఇంటర్నేషన ల్ 2018 గా కిరీటాన్ని పొందింది. 2021లో ఇచ్చట వాహనములు నిలుపరాదు అనే తెలుగు చిత్రంతో కథానాయకిగా పరిచయం అయింది. తర్వాత ఖిలాడీ, హిట్ కేస్ 2 చిత్రాల్లో నటించింది. ఈమె నటించిన గుంటూరు కారం చిత్రం పండక్కి విడుదల కానుంది. ప్రస్తుతం లక్కీ భాస్కర్ అనే తెలుగు చిత్రాల్లో నటిస్తుంది. సోషల్ మీడియాలో ఎప్పుడు యాక్టీవ్‌గా ఉంటూ అభిమానాలను ఖుషి చేస్తుంది ఈ ముద్దుగుమ్మ.

## ధనుష్ 'ఇడ్లీ కడై' సినిమా సెట్‌లో
# భారీ అగ్ని ప్రమాదం

**టాకీస్:** కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ నటిస్తున్న తాజా చిత్రం 'ఇడ్లీ కడై' సెట్‌లో శనివారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. తమిళనాడులోని తేని జిల్లా, అనుప్పపట్టి గ్రామంలో ఈ చిత్రం కోసం నిర్మించిన భారీ సెట్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. సెట్‌లో ఉపయోగించిన చెక్క, రసాయనాలు, ఫ్లెక్సీలు, పెయింట్స్ వంటి వస్తువుల కారణంగా మంటలు వేగంగా వ్యాపించి, సెట్ దాదాపు పూర్తిగా దగ్ధమైంది. అయితే, ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదని, ప్రాణనష్టం జరగలేదని సమాచారం.




ఈ చిత్రంలో నిత్యా మీనన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, ధనుష్ స్వీయ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది. డాన్ పిక్చర్స్ బ్యానర్‌పై ధనుష్, ఆకాష్ భాస్కరన్ నిర్మిస్తున్న ఈ చిత్రం అక్టోబర్ 1, 2025న థియేటర్లలో విడుదల కానుంది. ప్రమాదం కారణంగా షూటింగ్ తాత్కాలికంగా నిలిచిపోగా, అగ్ని ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు జరుగుతోంది.

# మలయాళంలో సూపర్‌హిట్..

## తెలుగులోకి రాబోతున్న 'జింఖానా'..

**టాకీస్:** మలయాళంలో బాక్సాఫీస్ హిట్‌గా నిలిచిన 'అలప్పుజ జింఖానా' చిత్రం తెలుగులోకి రాబోతున్న విషయం తెలిసిందే. 'జింఖానా' పేరుతో తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు మేకర్స్. 'ప్రేమలు' ఫేం నస్లెన్ ఇందులో కథానాయకుడిగా నటిస్తున్నాడు. ఖలీద్ రెహమాన్ స్వీయ దర్శకత్వంలో జాబిన్ జార్జ్, సమీర్ కారత్, సుభీష్ కన్నంచెరిలతో కలిసి ఈ స్పోర్ట్స్ డ్రామాకు నిర్మించారు. ఈ నెల 25న విడుదల




కానుంది. ఈ సందర్భంగా అగ్ర దర్శకుడు అనిల్ రావిపూడి ఈ మూవీ ట్రైలర్‌ని లాంచ్ చేశారు. కొందరు యువకులు బాక్సింగ్ క్లాస్ కోసం సెయిన్ చేయడంతో ట్రైలర్ మొదలైంది. ట్రైలర్ ఆద్యంతం వినోదాత్మకంగా సాగింది. బాక్సింగ్ అంటే పంచ్‌లు విసరడం మాత్రమే కాదని, ఇది క్రమశిక్షణ, విల్ పవర్‌తో కూడుకున్నదనే సందేశంతో ట్రైలర్ ముగిసింది. లుక్మాన్ అవరన్, గణపతి, బేబీ జీన్, సందీప్ ప్రదీప్, ఫ్రాంకో ఫ్రాన్సిస్ తదితరులు చిత్ర తారాగణం. ప్రేమలు తర్వాత నస్లేన్ సినిమా కావడంతో మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి.

## మోహన్ లాల్‌కి జెర్సీ గిఫ్ట్‌గా ఇచ్చిన
# ఫుట్‌బాల్ స్టార్ లియోనల్ మెస్సీ

**టాకీస్:** మలయాళం సూపర్ స్టార్ మోహన్‌లాల్‌కు ఫుట్‌బాల్ దిగ్గజం లియోనల్ మెస్సీ సంతకం చేసిన జెర్సీని బహుమతిగా ఇచ్చారు. మోహన్‌లాల్ ఈ ప్రత్యేకమైన బహుమతిని అందుకున్నందుకు తన ఆనందాన్ని సోషల్ మీడియాలో పంచుకున్నారు. "జీవితంలోని కొన్ని క్షణాలు





మాటల్లో వర్ణించలేనివి. అవి ఎప్పటికీ మీతోనే ఉంటాయి. ఈ రోజు, అలాంటి ఒక క్షణం నేను అనుభవించాను. ఈ బహుమతిని నేను నెమ్మదిగా విప్పుతున్నప్పుడు, నా గుండె వేగంగా కొట్టుకుంది. ఫుట్‌బాల్ దిగ్గజం లియోనల్ మెస్సీ స్వయంగా సంతకం చేసిన జెర్సీ. దానిపై నా పేరు అతని చేతితో రాయబడి ఉంది. మెస్సీని అతని ఆటతీరుకే కాకుండా, అతని నిరాడంబరత, వినయానికి కూడా అభిమానించే నాకు ఇది నిజంగా ప్రత్యేకమైనది. నా ప్రియమైన స్నేహితులు డాక్టర్ రాజీవ్ మంగోట్టిల్, రాజేష్ ఫిలిప్ సాయం లేకుండా ఈ అద్భుతమైన క్షణం సాధ్యమయ్యేది కాదు. ఈ విషయంలో వారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు. అన్నింటికీ మించి, ఈ మరపురాని బహుమతికి దేవుడికి ధన్యవాదాలు," అని మోహన్‌లాల్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

ఈ జెర్సీని మోహన్‌లాల్‌కు అతని స్నేహితులు సత్యన్ అంతికాడ్ దర్శకత్వం వహిస్తున్న 'హృదయపూర్వం' సినిమా సెట్‌లో అందజేశారు. ఈ ఊహించని బహుమతి మోహన్‌లాల్‌తో పాటు సత్యన్ అంతికాడ్‌ను కూడా ఆశ్చర్యపరిచింది. అభిమానులు, సహచర నటీనటులు మరియు శ్రేయోభిలాషులు మోహన్‌లాల్ పోస్ట్‌పై అభినందనలు తెలుపుతున్నారు. కాగా ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.

# జీవితంలో డబ్బు, స్టార్‌డమ్ కంటే అదే ముఖ్యం : షారుక్ ఖాన్

**టాకీస్:** జీవితంలో డబ్బు, స్టార్‌డమ్ కంటే ఒత్తిడి లేకుండా ఉండడమే ముఖ్యమని అంటున్నాడు బాలీవుడ్ బాద్‌షా షారుక్ ఖాన్. తన జీవితంలో జరిగి విషాద సంఘటన వలన తనకు డబ్బు, ఫేమ్ కంటే మానసికి ఒత్తిడి లేకుండా ఉండడమే లైఫ్‌లో ఉత్తమమని పంచుకున్నాడు షారుక్. త్వరలో కింగ్ సినిమాతో ప్రేక్షకు ల ముందుకు రాబోతున్న ఆయన తాజాగా ఆయన జీవితంలో జరిగిన ఒక సంఘటన గురించి పంచుకున్నాడు.



నా తల్లిదండ్రుల మరణం నా సోదరిపై తీవ్ర ప్రభావం చూపింది. ఆ రోజు నా తండ్రి మృతదేహం ముందు నిలబడి ఆమె ఏ మాత్రం ఏడవలేదు, ఇప్పటికీ ఆ సంఘటన నాకు గుర్తుంది. దాదాపు రెండు సంవత్సరాల పాటు ఆమె ఆ మానసిక స్థితి నుంచి బయటపడలేకపోయింది. అందుకే నేను ఆమెలా డిప్రెషన్‌లో కూరుకుపోకుండా సినిమాల్లో నిమగ్నమై ఉంటాను. అందుకే జీవితంలో డబ్బు, కీర్తి కంటే ఒత్తిడి లేకుండా జీవించడమే నాకు ముఖ్యం అంటూ షారుక్ చెప్పుకోచ్చాడు.

# సోదరా సినిమా అందరిని నవ్విస్తుంది.. ఏడిపిస్తుంది

## హీరోలు సంపూర్ణేష్ బాబు, సంజోష్

**టాకీస్:** వైవిధ్యమైన సినిమాలు, ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేసే సినిమాల్లో నటిస్తూ హీరోగా తనకంటూ ప్రేక్షకుల్లో ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాందించుకున్న కథానాయకుడు సంపూర్ణేష్ బాబు. ఈ సారి అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో, అన్నదమ్ముల అనుబంధాన్ని ఆవిష్కరిస్తున్న




'సోదరా' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఈ చిత్రంలో సంపూర్ణేష్ బాబుతోపాటు సంజోష్ కూడా మరో హీరోగా నటిస్తున్నాడు. మన్ మోహన్ మేనం పల్లి దర్శకత్వంలో క్యాన్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై చంద్ర చగంలా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

సంపూర్ణేష్ బాబు, సంజోష్‌లు హీరోలుగా నటిస్తున్న ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చిత్ర కథానాయకులు సంపూర్ణేష్ బాబు, సంజోష్‌లు మీడియాతో ముచ్చటించారు. ఈ సందర్భంగా సంపూర్ణేష్ బాబు మాట్లాడుతూ .. అన్నదమ్ముల బంధం ఎంత గొప్పదో మనందరికీ తెలుసు. అలాంటి అన్నదమ్ముల బంధాన్ని వెండితెరపై మనకు ఆవిష్కరించబోతున్న చిత్రమే సోదరా. ఇది నా గత చిత్రాల తరహాలో ఉండదు. ఇది కుటుంబ కథ ఇద్దరు అన్నదమ్ముల కథ. అన్నగా బరువు బాధ్యతలు ఉన్న పాత్రను ఈ చిత్రంలో పోషించాను.

ఈ సినిమా చూస్తున్నంత సేపు అందరికి తమ రియల్‌లైఫ్ సంఘటనలు గుర్తుకు వస్తాయి. నా రియల్‌లైఫ్‌లో ఉండే నరసింహాచారికి ఈ చిత్రంలో చేసిన పాత్రకు దగ్గరి పోలికలు ఉంటాయి. మొదటి మూడు నాలుగురోజులు ఈ పాత్రను పోషించడానికి ఇబ్బంది పడ్డాను. నాకు వేరే సినిమా షూటింగ్‌లు కూడా జరుగుతుండేవి. అయితే క్యారెక్టర్‌లోని మూడ్ పోకూడదని ఈ సినిమాలో నా పాత్ర కంప్లీట్ అయిన తరువాతే ఇతర సినిమాల చిత్రీకరణలో పాల్గొన్నాను. ఈ చిత్రంలో జనరల్‌గా నా సినిమాలో ఉండే వినోదంతోపాటు కుటుంబ భావోద్వేగాలు కూడా ఉంటాయి.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.